# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 124 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 24 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 124 24-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




## రాజధానిలో భూకేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

- మిగతా 3లో..



# పొలిటికల్ గవర్నెన్స్‌తోనే.. అభివృద్ధి..

- అధికారులు-ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి
- నియోజకవర్గాల బాధ్యత ఎమ్మెల్యేలు, ఎంపీలదే..
- యోగాడే స్ఫూర్తితో ముందుకుసాగుదాం
- మనందరి ఉమ్మడి టార్గెట్ 2029, 2047
- ఐఏఎస్‌లు 'బంగారు కుటుంబాలు'ను దత్తత తీసుకోవాలి
- 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- ప్రజాప్రతినిధులు-అధికారులతో తొలిసారి వినూత్న సదస్సు
- యోగాడే సక్సెస్ చేసిన అధికారులు, ఉద్యోగులకు సన్మానం







### గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదు

**అమరావతి జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పొలిటికల్ గవర్నెన్స్‌తోనే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. యోగా డే స్ఫూర్తితో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని, మనందరి ఉమ్మడి లక్ష్యం 2029, 2047 కావాలని పిలుపునిచ్చారు. ఐఏఎస్ అధికారులు 'బంగారు కుటుంబాలు'ను దత్తత తీసుకుని.. వాళ్ల ఉన్నతికి కృషి చేయాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించాలని... నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకెళ్లి... వినూత్నంగా ఆలోచిస్తేనే ఆశయాలు నెరవేరతాయని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం అమరావతి సచివాలయం సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే ఎలా ఉంటుందో చూపిస్తున్నాం**

స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 ఏళ్లు పూర్తవుతుంది. అప్పటికి దేశ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్-2047 రూపొందించారు. మనం కూడా రాష్ట్రం కోసం స్వర్ణాంధ్ర విజన్-2047 రూపకల్పన చేశాం. ప్రజలు అధికారం ఇవ్వబట్టే ఈనాడు మనం ఇక్కడ సమావేశమయ్యాం. ఎన్నికల సమయంలో కూటమిని ప్రజలు ఆదరించి ఓట్లేయడంతో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో ఎన్డీయే విజయం సాధించింది. మాపై ప్రజలు పెట్టుకున్న నమ్మకంతో ఈ విజయం సాధ్యమైంది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులపై ఉంది. డబుల్ ఇంజిన్ సర్కారుతో ఎంత అభివృద్ధి జరుగుతుందో చేసి చూపిస్తున్నాం. కేంద్రం సహకారం లేకుంటే ఊపిరి కూడా పీల్చుకోలేని పరిస్థితి నెలకొంది. విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడుతామని, పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు మాటిచ్చాం. ఏడాదిలోనే అన్నీ చేశామని మేం చెప్పడం లేదు. కానీ ఊహించిన దానికంటే ఎక్కువే చేశాం. నేను 4వ సారి సీఎం అయ్యాను... పదవి నాకు కొత్త కాదు. కానీ క్లిష్టమైన సమయంలో ముఖ్యమంత్రి అయ్యాను. 1995లో కూడా ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉండి జీతాలివ్వలేని

- తరువాయి 2లో..







## గెలిచింది కూటమికాదు... ప్రజలు!

విధ్వంసపాలనపై ప్రజా తిరుగుబాటు

5ఏళ్లలో సాధించలేనిది ఏడాదిలోనే!

ప్రజలకు చేరువగా వెళ్లి సేవలందించండి

సుపరిపాలన - తొలిఅడుగు సభలో మంత్రి నారా లోకేష్

- మిగతా 3లో..

మిగతాలు 3లో..

## మాది మంచి ప్రభుత్వం... మెతక ప్రభుత్వం మాత్రం కాదు

పిచ్చి పిచ్చి మాటలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

తలలు నరికేస్తాం... గొంతులు కోస్తాం అనే డైలాగ్స్ సినిమాల్లోనే బాగుంటాయ్

మరో 20 ఏళ్లు వైసీపీ ఇక రాదు... రాబోదు

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో

ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్

## సింగయ్య మృతి దృశ్యాలు భయానకం: షర్మిల



**అమరావతి జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జగన్ కాన్వాయ్ కింద పడి సింగయ్య మృతి భయానక దృశ్యాలపై షర్మిలఆవేదన వైసీపీ కాంగ్రెస్ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి వాహనం కింద పడి సింగయ్య నలిగిపోయిన దృశ్యాలు భయానకమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ఒళ్ళు గగుర్పొడిచేలా ఈ ఘటన ఉందన్నారు. ఆదివారం పీసీసీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ఈ ఘటనకు జగన్ బాధ్యత వహించాలన్నారు.

కారు కింద ఒక వ్యక్తి పడ్డారన్న సోయి లేకుండా కాన్వాయ్ కొనసాగడం ఏంటి ? 100 మందికి పర్మిషన్ ఇస్తే వేల మంది ముందు సైడ్ బోర్డు మీద నిలబడి జగన్ గారు చేతులూపడం ఏంటి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు మీకు ఎవరిచ్చారు ? బెట్టింగ్ లో ఓడిపోయి సూసైడ్ చేసుకున్న వ్యక్తి విగ్రహ ఆవిష్కరణకు ఇద్దరిని బలి ఇస్తారా ? ఇదేం రాజకీయం ? ఇదెక్కడి రాక్షస ఆనందం ? మీ ఉనికి కోసం జనాలను టైర్ల కింద తొక్కు కుంటూ పోతారా? ప్రజల ప్రాణాల మీద శవ రాజకీయాలు చేస్తారా ? కార్ సైడ్ బోర్డ్ మీద నిలబడి ఒక నాయకుడిగా

- తరువాయి 2లో..

## శ్రీశైలం ప్రాజెక్టు భారీగా వరద..



**శ్రీశైలం జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నది వరద కొనసాగుతున్నది. భారీగా వస్తున్న వరదతో ఇప్పటికే జూరాల ప్రాజెక్టు నిండిపోయింది. డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని వరదను అధికారులు దిగువకు వదులుతున్నారు. అక్కడి నుంచి వరద శ్రీశైలం జలాశయానికి చేరుతున్నది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 60,587 క్యూసెక్కుల వరద వస్తుందని అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 854.20 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215.7080 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 89.7132 టీఎంసీల నిలువ ఉన్నదని వివరించారు. అయితే, శ్రీశైలం డ్యామ్ కుడి, ఎడమ వైపు ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. నీటి మట్టం పెరిగితేనే విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

## వైఎస్ జగన్ మెడకు సింగయ్య కేసు..

### కూటమి సర్కారులో ఆయనపై తొలి కేసు

**అమరావతి జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఎన్నికలయిన ఏడాదికే ఏపీ రాజకీయాలు ముదిరి పాకాన పడుతున్నాయి. అధికార పక్షం-ప్రతిపక్షం ఒకరి మీద ఒకరు కారాలు మిరియాలు నూరే ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు ఏకంగా కత్తులు దూసే వరకు వెళ్లింది. మాజీ సీఎం వైఎస్ జగన్ పై కేసు నమోదైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయనపై ఇదే తొలి కేసు కావడం గమనార్హం. ఏపీలో 2019-24 మధ్య వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఉండగా మద్యం విధానంలో అక్రమాలు జరిగాయంటూ కూటమి సర్కారు పలువురిని అరెస్టు చేసింది. ఈ కేసు అసలు ఉద్దేశం మాజీ సీఎం వైఎస్ జగన్ ను ఇరికించడమే అయినా.. ఇంకా ఆయన వరకు వెళ్లలేదు. అయితే, ఈలోగానే వైఎస్ జగన్ పై చీలి సింగయ్య మృతి ఘటనలో కేసు నమోదైంది.గత బుధవారం వైఎస్ జగన్ పల్నాడు జిల్లా పర్యటనకు వెళ్లారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న రెంటపాళ్లకు చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని జగన్ పరామర్శించారు. అయితే, ఈ పర్యటనకు పోలీసులు పలు ఆంక్షలు విధించారు. వందమంది మించకుండా వెళ్లాలని.. ఎస్కార్ట్ కాకుండా మూడు వాహనాలకే అనుమతి అని తేల్చిచెప్పారు. కానీ, వైఎస్ జగన్ స్థాయి నాయకుడు బయటకు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసు కదా?ఈ క్రమంలో ఆయన పర్యటన సందర్భంగా

- తరువాయి 2లో..

# సంపాదకీయం

## యుద్ధాలు వద్దంటున్న జనం

యుద్ధాలు ఎన్ని అనర్థాలకు దారితీస్తున్నాయో ప్రపంచం ప్రత్యక్షంగా చూస్తోంది. నియంతలైన దేశాధినేతల రణదాహం ముందు జనక్షేమం ఓడిపోతోంది. దేశాలు మందుపాతరల గనులుగా, పట్టణాలు శ్మశానాలుగా, భవనాలు బూడిద కుప్పలుగా క్షణాల్లో మారిపోతున్నాయి. బాంబుల దాడులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. తలదాచుకొనే చోటులేక పరుగులు తీస్తున్నారు. విషవాయువులు కమ్ముకుని అంటువ్యాధులు పీడిస్తున్నాయి. ఇన్ని అనర్థాలు జరుగుతున్నా దేశాల పాలక నియంతలకు బుద్ధి రావడం లేదు. ప్రత్యర్థులను చంపడమే లక్షంగా ముందుకు సాగుతున్నారు.

అన్నవస్త్రాల కన్నా అణ్వాయుధాలే ఇప్పుడు అవసరమవుతున్నాయి. ప్రపంచం మొత్తంమీద కేవలం తొమ్మిది దేశాల్లోనే అణుబాంబులున్నాయని, వీటిని ప్రయోగిస్తే భూగోళం ఎందుకూ పనికిరాక విధ్వంసానికి గురవుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉక్రెయిన్ రష్యా యుద్ధం (%ఖఎత్ఖిఅవ =బంంఖు ఔఖితీ%) గత మూడేళ్లుగా సాగుతున్నందుకు రష్యా పైచేయి సాధించినట్టు కనిపిస్తున్నా ఆర్థిక సంక్షోభం కమ్ముకొస్తోంది. సైన్యంలో చేరేవారికి భారీ మొత్తంలో బోనస్‌లు ఇవ్వడం, యుద్ధం లో మరణించిన సైనిక కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం కల్పించడం తదితర చర్యలు రష్యా ఖజానాను ఖాళీచేయిస్తున్నాయి. అటుఇటు కొన్ని వేలమంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ గణాంకాలు బయటకు రావడం లేదు.

జరగవలసిన విధ్వంసం అంతా జరిగాక ఇప్పుడు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలకు సిద్ధమని ప్రకటించడం ఎవరిని రక్షించడానికి? ఇజ్రాయెల్ పాలస్తీనా మధ్య జరుగుతున్న యుద్ధంలో పాలస్తీనా చిరునామా చెరిగిపోతోంది. పాలస్తీనా ప్రజలు ఆకలి మంటలకు ఆహుతై పోతున్నా కనీసం ఆహారం కూడా వారికి అందకుండా ఇజ్రాయెల్ రాక్షస క్రీడ సాగిస్తోంది. ఇప్పుడు గత ఏడెనిమిది రోజులుగా ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం బీభత్సంగా సాగుతుండడంతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. ఇజ్రాయెల్ రణజ్వాలలకు అమెరికా ఆజ్యం పోస్తోంది. ఈ యుద్ధాలన్నిటికీ కాలుదువ్వుతున్నది పాలకుల కండకావరం తప్ప ప్రజలు కాదు. అనర్థాలను భరిస్తున్నదీ ప్రజలే.

ఏదేమైనా ఈ యుద్ధంలో అమెరికా ఇజ్రాయెల్‌కు అండగా జోక్యం చేసుకోవడానికి అమెరికన్ ప్రజలు ఒప్పుకోవడం లేదు. ఎక్కువ శాతం మంది తిరస్కరిస్తున్నారు. అమెరికాకు ఇరాన్ ఆగర్భశత్రువని కొంత మంది అమెరికన్లు అభిప్రాయపడుతుండగా, అమెరికా మిలిటరీ ఈ యుద్ధంలో ప్రవేశించడం మంచిది కాదని 60 శాతం మంది హితవు పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో యూగవ్ అనే సంస్థ నిర్వహించిన శాంపిల్ సర్వేలో అమెరికా వయో వృద్ధులు 60 శాతం మంది యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోరాదని తమ అభిప్రాయాన్ని స్పష్టం చేస్తున్నారు. డెమొక్రాట్స్ 65 శాతం మంది, ఇండిపెండెంట్లు 61 శాతం మంది, రిపబ్లికన్లు 53 శాతం మంది యుద్ధానికి వ్యతిరేకత చూపిస్తున్నారు.

యుద్ధంలో అమెరికా జోక్యాన్ని వయోవృద్ధులు కేవలం 16% మంది మాత్రమే సమర్థిస్తున్నారు. అలాగే డెమొక్రాట్స్15 శాతం మంది, ఇండిపెండెంట్లు 11 శాతం మంది, రిపబ్లికన్లు 23 శాతం మంది దీనికి అంగీకరిస్తున్నారు. అమెరికా నేరుగా ఇరాన్‌తో యుద్ధానికి దిగే అవకాశం ఉందని తెలియడంతో చమురు మార్కెట్ తాజాగా అస్థిరతతో అల్లాడుతోంది. బ్రెంట్ క్రూడ్ బారెల్ దాదాపు 77 డాలర్లకు చేరింది. హొర్ముజ్ జలసంధిలో నౌకా రవాణా మార్గాల్లో మార్పులు రావచ్చు. దాంతో రవాణా వ్యయం విపరీతంగా పెరిగే ప్రమాదం ఏర్పడుతుంది. అంతర్జాతీయ చమురు మార్కెట్‌కు మధ్యప్రాచ్యం కీలకమైన మార్గం. ధరలు పెరుగుతుంటే ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. అలాగే ప్రపంచ దేశాలకు చమురు నౌకా రవాణా, ఇంధనం అందుబాటు క్లిష్టతరమవుతుంది. 2019లో అమెరికా ఆంక్షలు విధించడంతో ఇరాన్ నుంచి భారత్‌కు చమురు దిగుమతులు లేకపోయినప్పటికీ, మధ్యప్రాచ్య నుంచి ప్రకంపనలు ప్రభావం చూపిస్తాయి.

ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. వారం కిందట బ్రెంట్ క్రూడ్ ధరలు 69.4 డాలర్లు ఉండగా, ఇప్పుడు (జూన్ 18) 77 డాలర్లకు పెరిగింది. మార్కెట్‌లో ధరలు కొన్ని రోజుల్లోనే 8 డాలర్ల వంతున పెరిగాయి. బ్రెంట్ ధర బ్యారెల్‌కు 10 డాలర్ల వంతున పెరగవచ్చని భావిస్తున్నారు. గత శుక్రవారం ఇజ్రాయెల్ దాడులు చేసిన దగ్గర నుంచి ఇరాన్ నుంచి రోజువారీ చమురు ఎగుమతులు 44 శాతం వరకు పెరిగాయి. ప్రపంచం మొత్తం మీద చమురు నిల్వల్లో 12 శాతం, మధ్యప్రాచ్యం మొత్తం చమురు నిల్వల్లో 24 శాతం వరకు ఇరాన్‌లో 154 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు ఉంటాయి.

తొమ్మిదో భారీ చమురు ఉత్పత్తి దేశంగా రోజూ 3.3 మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తుంది. అలాగే రోజూ 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును, శుద్ధి చేసిన ఇంధనాన్ని ఎగుమతి చేస్తుంది. జూన్ 13న ఇజ్రాయెల్ దాడుల తరువాత ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ట్యాంకరు రేట్లు పెరిగాయి, ముఖ్యంగా హొర్ముజ్ జలసంధి ద్వారా నౌకా రవాణా అగమ్యగోచరమవుతుందని వ్యాపారులు అంటున్నారు. హొర్మూజ్ జలసంధిని కూడా మూసివేసే ఆప్షన్ తమవద్ద ఉందని ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేయడం తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ జలసంధిని మూసివేయడం కూడా ఓ మార్గమని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు బెహ్నాంసయీదీ గురువారం మీడియాకు వెల్లడించడం అంత తేలికగా తీసుకోరాదు.

## పొలిటికల్ గవర్నెన్స్‌తోనే.. అభివృద్ధి



పరిస్థితి ఉన్నా ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపించాను. 2014లో రాష్ట్ర విభజన జరిగి కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేదు. బస్సులో ఉండి పాలన చేసి 13.5 శాతం గ్రోత్‌రేట్ సాధించాం. మన ప్రయాణం ఎక్కడ ప్రారంభమైంది, ఇప్పటి వరకు ఏం చేశాం... ఇంకా ఏం చేస్తామో సమీక్షించుకోవడానికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సమన్వయంతో మూడు పార్టీలు ముందుకు**

లిఓటు విభజన జరగకూడదని నేను, పవన్ కళ్యాణ్ చెప్పాం. గెలుపు మా కోసం కాదు, రాష్ట్ర భవిష్యత్ కోసమని పిలుపునిచ్చి టీడీపీ, జనసేన, బీజేపీ ముందుకెళ్లాయి. అధికారంలో మూడు పార్టీలు మిళతమై ఉన్నా ఎక్కడా సమస్యలు లేకుండా ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నాం. దీనికి సహకారం అందిస్తోన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, కేంద్రానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే ఏదైనా సాధ్యమవుతుంది. ప్రభుత్వ ఫలితాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. మనపై ఉన్న బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలంటే నిత్యం కొత్త విషయాలను గురించి తెలుసుకోవాలి, ప్రజల సమస్యల్ని అధ్యయనం చేయాలి, వారి అభీష్టం మేరకు మనం పని చేయాలని అధికార యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధులను కోరుతున్నా.' అని సీఎం అన్నారు.

**ఐదేళ్లు మూడు ముక్కలాటాడారు**

'ప్రజలు పెట్టుకున్న ఆకాంక్షల నుంచి అభివృద్ధి దిశగా పయనిస్తున్నాం. కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశలు చాలా ఉన్నాయి. కానీ మనకు అనేక ఇబ్బందులు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు ఎన్డీయే కూటమి పని చేస్తోంది. సూపర్-6తో పాటు మరికొన్ని ఎన్నికల హామీలు ఇచ్చాం. వీటి అమలుపై సమీక్ష చేసుకుంటున్నాం. ఎన్నికల ముందు పార్టీలు హామీలు ఇస్తాయి. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై వాటిని అమలు చేసే బాధ్యత ఉంటుంది. దీన్నే పొలికటికల్ గవర్నెన్స్ అంటారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసం వల్ల రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులు వెళ్లిపోయారు. రాష్ట్రంపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పోయింది. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారు. శాంతి భద్రతలు దెబ్బతీశారు. మూడ రాజధానుల అంటూ ఐదేళ్లు మూడు ముక్కలాడారు.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు.

**సంపద సృష్టిస్తేనే ఖర్చు చేసే హక్కు**

పోలవరం ప్రాజెక్టు పూర్తైతే చాలావరకు సమస్యలు పరిష్కారమవుతుంది. ఏపీకి చాలా వరకు నీటి సమస్య తీరుతుంది. దక్షిణ భారతదేశంలో నీటి సౌలభ్యం అధికంగా ఉన్న రాష్ట్రం ఏపీ. నదుల అనుసంధానిస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి డయాఫ్రం వాల్ కొట్టుకుపోయేలా చేసింది. రాష్ట్రంలో పాలన ఉందా అనే అనుమానాన్ని కలిగించారు. ఎక్కడ చూసినా వేధింపులు, అణగదొక్కే దోరణిలే కనిపించాయి. పాలన ప్రజల కోసం చేయాలన్న ఆలోచనే కూడా నాటి పాలకులు చేయలేదు. ఒక ప్రణాళిక లేకుండా వ్యవహరించారు. రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారు. సంపద సృష్టించి ఆదాయం పెంచితే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే అర్హత ఉంటుంది. ఆదాయం పెంచకుండా అప్పులు తెచ్చి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తానంటే ఎక్కడి నుంచి డబ్బులు వస్తాయి.? ఆదాయాన్ని పెంచుకుని అభివృద్ధి చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలి. గత ప్రభుత్వం చేసిన అప్పులు చూసి 2022-2023లో అప్పులు చేసే అవకాశం లేదని నీతి ఆయోగ్ రిపోర్టు కూడా ఇచ్చింది. తెచ్చిన అప్పులు చెల్లించాలి, అప్పులకు వడ్డీలు కట్టాలి...సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి. అన్ని వ్యవస్థలను కుదేలు చేసి వెళ్లిపోయారు. ఒక్క మైనింగ్ శాఖలోనే రూ.10 వేల కోట్ల ఆదాయం పోయింది. ఒప్పందం చేసుకున్న సోలార్ విద్యుత్‌ను వాడకపోవడంతో రూ.9 వేల కోట్లను అప్పనంగా చెల్లించాల్సి వచ్చింది. నిధుల్ని ఇబ్బడిముబ్బడిగా దారిమళ్లించారు. కేంద్ర పథకాలకు వచ్చే నిధులను కూడా మళ్లించారు. సంక్షేమం సాధికారత, పెట్టుబడుల సాధన, సంపద సృష్టి, ఆదాయం పెంచడం.. ఈ నాలుగింటిని సమానంగా తీసుకెళ్తేనే ఆర్థిక వ్యవస్థ మనుగడ సాధిస్తుంది. కేంద్రంలో నరేంద్ర మోదీ సుస్థిర ఆర్థిక వ్యవస్థకు నాంది పలికారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు తలసరి ఆదాయాన్ని పెంచారు.

**పట్టుదలతో పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలి**

అధికారంలోకి రాగానే 4 కీలక హామీలపై సంతకాలు చేశాను. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంతకం పెట్టాను... వీటికి పరీక్షలు కూడా జరుగుతున్నాయి. గత ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి యాంటీ ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని తెచ్చాం. మాకు ప్రజల నుంచి వచ్చే వినతుల్లో 80 శాతం రెవెన్యూవే ఉన్నాయి. పట్టుదలతో పని చేసి ఏడాదిలో అర్హులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పింఛన్లు దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా అందిస్తున్నాం. గత ప్రభుత్వం మూసేసిన అన్నక్యాంటీన్లను అధికారంలోకి రాగానే 203 ప్రారంభించాం. ఇప్పటివరకు 4 కోట్ల మందికి పైగా భోజనాలు అందించాం. రాష్ట్రానికి కేంద్రం సాయం అందిస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్లు, రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇచ్చింది. అమరావతి పనులు చేపట్టి రాజధానిని పట్టాలెక్కించాం. పోలవరానికి రూ.12,500 కోట్లు అందించింది.. దీన్ని 2027కి పూర్తి చేసేలా లక్ష్యం విధించుకున్నాం. ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులకు రూ.5 వేల కోట్లు ఇచ్చింది. విశాఖ రైల్వేజోన్ పనులు కూడా సాగుతున్నాయి.' అని సీఎం వివరించారు.

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం**

'ఎన్నికల ముందు చెప్పిన విధంగానే ఎంతమంది పిల్లలున్నా తల్లికివందనం ఇస్తామని చెప్పాం..అందరికీ డబ్బులు ఇచ్చాం. మహిళలకు ఉచిత బస్సును కూడా ఆగస్టు 15 నుంచి అమలు చేస్తాం. గౌడలకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చాం. మత్స్యకార సేవలో భాగంగా ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు వేట నిషేధ భృతిని అందించాం. 90 శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ ఇస్తున్నాం. 20 లక్షల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసేందుకు సంకల్పం తీసుకున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం. 3 కిలో వాట్లకు బీసీలకు రూ.98 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. దీన్ని పూర్తి చేసే బాధ్యత అధికారులు తీసుకోవాలి. చేనేతలకు మరమగ్గం ఉంటే 500 యూనిట్లు, మగ్గం ఉన్నవారికి 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నాం. భోగాపురం విమానాశ్రయాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నాం. వచ్చే ఏడాదికి దీన్ని అందుబాటులోకి తెస్తాం. ఒకే ఏడాదిలో రూ.3,800 కోట్లతో హంద్రీనీవా పనులు చేపట్టాం. పోలవరం ఎడమ కాల్వను పూర్తి చేసి అనకాపల్లికి నీళ్లు అందిస్తాం. సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు పూడ్చి పాత్ హోల్ ఫ్రీ రోడ్లుగా మార్చాం. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. 33 పెట్టుబడి పాలసీలు తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వం మన ఏపీయే. నియోజకవర్గాలకు పెట్టుబడులు తీసుకొచ్చే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులు తీసుకోవాలి.

**కష్టాలు వెంటాడుతున్నా వృద్ధిరేటు సాధించాం**

విజయవాడ, విశాఖపట్నంలో మెట్రో నిర్మాణానికి కేంద్రం కూడా ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం 95 కేంద్ర ప్రాయోజిత పథకాలు రద్దు చేస్తే మనం అధికారంలోకి వచ్చాక 82 పథకాలు తిరిగి ప్రారంభించాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొచ్చాం. పెట్టుబడిదారుల నుంచి ఏ అభ్యర్థన వచ్చినా ఆలస్యం చేయకుండా అనుమతులు ఇచ్చి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ల్యాండ్ రికార్డులను సరి చేయాలి.. అర్హులకు న్యాయం జరిగేలా చూడాలి.. ఎమ్మార్వోలు.. ఆర్డీవోలు ఇక్కడే ఉన్నారు.. దీన్ని కచ్చితంగా చేసి తీరాలి.

**గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదు**

'గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు ఇబ్బంది ఉండదు. తెలుగు రాష్ట్రాలు బాగుపడాలంటే గోదావరి నీళ్లను రెండు రాష్ట్రాలు వాడుకోవాలి. 3000 టీఎంసీలు నీళ్లు వృధాగా సముద్రంలోకి పోతున్నాయి. ఇందులో కొంత మొత్తం వాడుకున్నా.. తెలుగు రాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లను గతానికంటే పెంచాం. పాడి రైతులకు గోకుల్ షెడ్లు ఇచ్చాం. హంద్రీనీవా కోసం రూ. 3800 కోట్లు ఖర్చు పెట్టాం. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం కొత్త పాలసీ తెచ్చాం. ఆక్వా రైతులకు పవర్ సబ్సిడీ ఇచ్చాం. అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టిన ఘనత పవన్ కళ్యాణ్‌కు దక్కింది. అన్ని స్కూళ్లల్లో మెగా పేరెంట్ టీచర్ల మీటింగులు పెట్టారు మంత్రి నారా లోకేష్. వైద్య రంగం అభివృద్ధికి పని చేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో కనీసం 100 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి చర్యలు.. దీనికి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి. సంక్షేమ పథకాలు దీపం, తల్లికివందనం, పెన్షన్లు వంటివి అమలు చేస్తున్నాం. పీ-4 ద్వారా పేద కుటుంబాలను ఆదుకుంటున్నాం. ఇప్పటి వరకు 87,226 బంగారు కుటుంబాలను గుర్తించి వారి అభివృద్ధి బాధ్యతను 7,867 మంది మార్గదర్శకులకు అప్పజెప్పాం. ఆర్థిక అసమానతలను తగ్గించేందుకే పీ-4 విధానం. పేదలను ఆదుకునే బాధ్యతను ప్రభుత్వంతో పాటు.. సంపన్నులు తీసుకోవాలి. సమాజంలోని వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి చెందిన వారు పేదలను ఆదుకునే బాధ్యత తీసుకోవాలి. అంబేద్కర్‌కు బరోడా మహరాజు సహకరించారు.. ఓ మేధావిని దేశానికి అందించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను పీ-4 పరిధిలోకి తేవాలి.' అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

**వచ్చే నాలుగేళ్లలో అందరికీ ఇళ్లు**

ఇప్పటి వరకు రూ. 9.34 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం.. 8.50 లక్షల మందికి ఉపాధి రానుంది. నియోజకవర్గాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా ముందుకు వస్తారేమోననే దిశగా ఎమ్మెల్యేలు కూడా ఆలోచన చేయాలి. వెనుకబడిన నియోజకవర్గాల్లో ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే.. వారికి మరిన్ని ప్రోత్సహకాలిస్తాం. విజన్ 2020 నిజమిం.. ఇప్పుడు విజన్ 2047 లక్ష్యంతో పని చేస్తున్నాం. విశాఖ యోగా డే కార్యక్రమాన్ని లక్షల మందితో నిర్వహించాం.. మొదట్లో ఇది సాధ్యం కాదన్నారు. కానీ మంచి ప్రణాళికతో కార్యక్రమాన్ని జయప్రదం చేశాం. 200 మందితో కార్యక్రమం చేపట్టాలని కలెక్టర్ భావిస్తే.. అదే కలెక్టరుతో 3 లక్షల మందితో యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించేలా చేశాం. 2047 విజన్ సాధనకు పది సూత్రాలను రూపొందించుకున్నాం. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఎలాంటి లోటు లేకుండా.. అన్ని రకాల సౌకర్యాలు.. అన్ని వసతులు కల్పించేలా విజన్ రూపొందించాం. ప్రతి ఒక్కరికి ఇంటి జాగాను వచ్చే నాలుగేళ్లల్లో ఇస్తాం. వచ్చే నాలుగేళ్లల్లో అందరికీ ఇళ్లు కట్టిస్తాం. కేంద్ర ప్రభుత్వ పథకం జల్ జీవన్ మిషన్ పథకాన్ని గత ప్రభుత్వం సరిగా వినియోగించుకోలేదు. నేను, పవన్ కళ్యాణ్ కేంద్రం మీద ఒత్తిడి తెస్తే.. జల్ జీవన్ మిషన్ పథకాన్ని మన రాష్ట్రంలో అమలు చేసుకునేందుకు మరో రెండేళ్ల గడువు పొడిగించారు. జనాభా తగ్గుదల అనేది చాలా దేశాల్లో అతి పెద్ద సమస్యగా ఉంది. యువకులు తగ్గిపోతున్నారు.. ముసలి వాళ్లు పెరిగిపోతున్నారు. కొన్ని దేశాలు యువతను దత్తతను తీసుకునే పరిస్థితికి చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో మనం ముందు చూపుతో ఆలోచన చేయాలి. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశంలో జనాభా భారీగా తగ్గనుంది. దీన్ని నివారించాల్సిన అవసరం ఉంది.. దీని కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నాం. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులుగా చేశాం.. ఇప్పుడు ఆ నిబంధనను తప్పించాం. పెద్ద కుటుంబాలకు.. మరిన్ని ప్రోత్సహకాలు ఇచ్చేలా ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉంది.

**వృద్ధి రేటులో అనూహ్య పెరుగుదల**

2024-25 ఆర్థిక సంవత్సరానికి జీఎస్డీపీలో 12.02 శాతం వృద్ధి రేటు సాధించి రూ.15.93 లక్షల కోట్లు నమోదు చేశాం. ఇదే సమయానికి దేశంలో వృద్ధి 9.8 శాతమే ఉంది. 2014-15 నుంచి 2018-19 మధ్య కాలంలో సగటు వృద్ధి 13.49 శాతం సాధిస్తే... ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో సగటున 10.32 శాతం వృద్ధి మాత్రమే నమోదు చేసింది. గత ప్రభుత్వంలో వృద్ధి రేటు పడిపోవడంతో రూ.76,195 కోట్లు నష్ట పోయాం. 2024-25లో వ్యవసాయరంగంలో 15.41 శాతం, పరిశ్రమల రంగంలో 6.41 శాతం, సేవల రంగంలో 11.82 శాతం నమోదు చేశాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం 11.89 శాతం పెరిగింది. రూ.2,37,951 నుంచి రూ.2,66,240కు పెంచగలిగాం. 2029 నాటికి రాష్ట్ర జీఎస్డీపీ రూ.29.29 లక్షల కోట్లు, తలసరి ఆదాయం రూ.5.42 లక్షలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 2047 నాటికి రాష్ట్ర జీఎస్డీపీ రూ.308 లక్షల కోట్లు, తలసరి ఆదాయం రూ.55 లక్షలు నమోదు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో మైక్రో-మాక్రో విజన్ ప్లానింగ్ అమలు చేస్తున్నాం. పొలిటికల్ గవర్నెన్స్ అనుసరిస్తున్నాం. 9 థీమాటిక్ విజన్ ప్లాన్లు, 10 సెక్టారల్ విజన్ ప్లాన్లు రూపొందించాం. ఇందులో ఎంపీలను, ఎమ్మెల్యేలను, కలెక్టర్లను, జిల్లా స్థాయి అధికారులను భాగస్వామ్యం చేశాం. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వరకు ప్రణాళిక అమలు బృందాలు ఏర్పాటు చేస్తున్నాం. విశాఖపట్నం, అమరావతి, రాయలసీమను 3 స్ట్రాటజిక్ రీజియన్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నాం. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా చేస్తాం. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధిస్తాం. సర్క్యులర్ ఎకానమీకి ప్రాధాన్యత ఇస్తున్నాం. విశాఖలో యోగా డే విజయవంతంగా నిర్వహించడంతో కేంద్రం మనల్ని ప్రశంసించింది. ఏదైనా సాధించే శక్తిసామర్థ్యాలు మనకున్నాయి. రియల్ టైమ్ డేటా ఇంటిగ్రేట్ చేస్తున్నాం. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌పై దృష్టి పెట్టాం. అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతాం. ఏఐ యూనివర్సిటీ నెలకొల్పుతాం. విశాఖపట్నం మెడ్‌టెక్ జోన్, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర ద్వారా 503 సేవలు అందిస్తున్నాం. ఆగస్ట్ 15 నాటికి ఈ సేవలను 703కి పెంచుతాం. ఇప్పటివరకు 25 డిజిటల్ క్యాబినెట్లు నిర్వహించాం. యోగాంధ్ర-యోగాడే కార్యక్రమాలతో రికార్డులు సృష్టించాం. 21 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులు, 2 గిన్నిస్ వరల్డ్ రికార్డులతో ఏపీని చరిత్రలో నిలిపాం. 3.03 లక్షల మంది ఒకేచోట యోగాలో పాల్గొనడం, అలాగే 22,122 మంది గిరిజన విద్యార్థులు సూర్యనమస్కారాలు చేయడం మరెవ్వరికీ సాధ్యం కాదు.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అంతర్జాతీయ యోగాడే సక్సెస్ చేసిన వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులను సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం సన్మానించారు. లోకేష్ నేతృత్వంలో యోగా డే కోసం ఏర్పడిన కెబినెట్ సబ్ కమిటీలోని మంత్రులను సీఎం, డిప్యూటీ సీఎంలు అభినందించారు.

## సింగయ్య మృతి దృశ్యాలు భయానకం: షర్మిల

కాన్వాయ్ మూవ్ చేయించడం సబబేనా? ఇది పూర్తిగా జగన్ గారి బాధ్యత రాహిత్యాని అద్దం పడుతుంది. బలప్రదర్శన చేసి సింగయ్య మృతికి కారణమైన జగన్ 100 మందికి అనుమతి ఇచ్చి వేల మందితో వచ్చినా దగ్గరుండి మరి చోద్యం చూసిన కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి.పర్మిషన్ లేకుండానే జనసమీకరణ పోలీసులు మౌనంగా ఎందుకు? పర్మిషన్ కు విరుద్ధంగా జన సమీకరణ జరుగు తుంటే పోలీసులు ఎలా సహకరించారు? ఎందుకు ప్రేక్షక పాత్ర వహించారు ? ఎందుకు ఇంటలిజెన్స్ వ్యవస్థను నిద్రపుచ్చారు ? ప్రజా సమస్యలపై పోరాడితే ఆంక్షలన్నీ కాంగ్రెస్ పార్టీకేనా? కాంగ్రెస్ చేసే ఉద్యమాలకు, ధర్నాలకు హౌజ్ అరెస్ట్ లు చేస్తారు. దీక్షలను భగ్నం చేస్తారు. ర్యాలీలను తొక్కిపెట్టి మా గొంతు నొక్కుతారు. వైసీపీ చేసిన బలప్రదర్శనలకు, హత్యలకు జగన్ ఏం సమాధానం ఇస్తారు ? కూటమి ప్రభుత్వం ఏం సమాధానం చెప్తుంది ? ఏం చర్యలు తీసుకుంటున్నారు ? అంటూ ప్రశ్నించారు. కార్ సైడ్ బోర్డ్ మీద నిలబడి ఒక నాయకుడిగా కాన్వాయ్ మూవ్ చేయించడం సబబేనా? అన్నారు. ఇది పూర్తిగా వైఎస్ జగన్ బాధ్యత రాహిత్యానికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. బలప్రదర్శన చేసి సింగయ్య మృతికి కారణమైన జగన్ తోపాటు వంద మందికి అనుమతి ఇచ్చి వేల మందితో వచ్చినా దగ్గరుండి మరి చోద్యం చూసిన కూటమి ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహించాల్సి ఉందని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. పర్మిషన్కి విరుద్ధంగా జన సమీకరణ జరుగుతుంటే పోలీసులు ఎలా సహకరించారని సందేహం వ్యక్తం చేశారు. వారు ఎందుకు ప్రేక్షక పాత్ర వహించారని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థను ఎందుకు నిద్రపుచ్చారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడితే.. ఆంక్షలన్నీ కాంగ్రెస్ పార్టీకేనా? అంటూ ఆవేదన చెందారు. కాంగ్రెస్ పార్టీ చేసే ఉద్యమాలకు, ధర్నాలకు హౌస్ అరెస్టు చేస్తారన్నారన్నారు. అలాగే తమ పార్టీ చేసే దీక్షలను భగ్నం చేస్తారని.. ఆ క్రమంలో ర్యాలీలను తొక్కిపెట్టి మా గొంతు నొక్కుతారని వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ చేసిన బలప్రదర్శనలకు, హత్యలకు వైఎస్ జగన్ ఏం సమాధానం ఇస్తారన్నారు.

## వైఎస్ జగన్ మెడకు సింగయ్య కేసు.. కూటమి సర్కారులో ఆయనపై తొలి కేసు

చీలి సింగయ్య అనే వ్యక్తి మరణించాడు. వైఎస్ జగన్ కాన్వాయ్ లోని వాహనం ఢీకొన్నట్లు తొలుత కథనాలు రాగా.. ఆదివారం నేరుగా జగన్ వాహనం కిందపడే సింగయ్య మరణించినట్లు వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి జగన్ పై కేసు నమోదు చేసినట్లు గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.ఈ నెల 18న జగన్ పర్యటన సందర్భంగా గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ప్రమాదం జరిగిందని ఎస్పీ తెలిపారు. రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో ఉన్న సింగయ్యను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారని పేర్కొన్నారు. సింగయ్య భార్య లూర్దు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని.. సీసీ టీవీ ఫుటేజీ, డ్రోన్ సీన్లు, ప్రత్యక్ష సాక్షులు తీసిన వీడియోలను పరిశీలించి.. జగన్ వాహనం కిందే సింగయ్య పడినట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు. దీంతో సెక్షన్లు మార్చి కేసు నమోదు చేశామన్నారు. వైఎస్ జగన్ తో పాటు ఆయన కారు డ్రైవర్ రమణారెడ్డి, పీఏ నాగేశ్వరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజనీలపైనా కేసులు నమోదు చేసినట్లు వివరించారు.వైఎస్ జగన్ తాడేపల్లి నుంచి సత్తెనపల్లి వెళ్లేందుకు 14 వాహనాలకు అనుమతి ఇచ్చామని.. కానీ ఆయన కాన్వాయ్ మొదలైనప్పుడు 50 వాహనాల్లో ర్యాలీగా వచ్చారని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. దీనిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాగా, సింగయ్య చనిపోయింది ప్రయివేటు కారు కింద పడి అని ఘటన జరిగిన రోజు ఎస్పీ చెప్పారు. దీనిపై ఆయనపై మాట్లాడుతూ.. అప్పటికి ఉన్న సమాచారం ప్రకారం అలా చెప్పినట్లు వివరించారు. డ్రోన్లు, స్థానికులు వీడియోల ఆధారంగా ఇప్పుడు వైఎస్ జగన్ తదితరులపై కేసు నమోదు చేశామన్నారు.

# గెలిచింది కూటమికాదు... ప్రజలు!

- విధ్వంసపాలనపై ప్రజా తిరుగుబాటు
- 5ఏళ్లలో సాధించలేనిది ఏడాదిలోనే!
- ఉద్యోగులే ప్రభుత్వానికి గుండెకాయ
- ప్రజలకు చేరువగా వెళ్లి సేవలందించండి
- సుపరిపాలన - తొలిఅడుగు సభలో మంత్రి నారా లోకేష్




అమరావతి జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమరావతి: జూన్ 4 రాష్ట్ర చరిత్రను మార్చిన రోజు, ప్రజాస్వామ్యం గెలిచిన రోజు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి రాజ్యాంగం గొప్పతనం ఏంటో మరోసారి తెలిసిన రోజు అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సుపరిపాలన %-% తొలిఅడుగు సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ... అందరూ కూటమి గెలిచింది, టిడిపి గెలిచింది, జనసేన గెలిచింది, బిజెపి గెలిచింది అంటున్నారు. గెలిచింది కూటమి కాదు గెలిచింది ప్రజలు. 94 శాతం స్ట్రైక్ రేట్ ..164 అవుట్ ఆఫ్ 175. ప్రజలు రికార్డులు బద్దలు కొట్టారు. చరిత్రను తిరగరాసారు. ఇది ప్రజా విజయమని అన్నారు.

**కంపెనీలను తరిమేశారు!**

రాజ్యాంగం ఎంత గొప్పదైనా దానిని అమలు చేసేవారు చెడ్డవారు అయితే చెడ్డ ఫలితాలే వస్తాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు అన్నారు. గత ఐదేళ్లు విధ్వంస పాలన మనం చూసాం. 10 లక్షల కోట్లు అప్పు చేసారు. ఆంధ్రప్రదేశ్ ను అప్పులప్రదేశ్ గా మార్చేసారు. ఒక్క కొత్త కంపెనీ తీసుకురాలేదు.. ఉన్న కంపెనీలు తరిమేసారు. దేశంలో ఎక్కడైనా పెట్టుబడులు పెడతాం ఆంధ్రప్రదేశ్ లో మాత్రం పెట్టుబడులు పెట్టం అని ఒక పెద్ద కంపెనీ అధినేత ప్రకటించారు. ఆరోజు పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో చెప్పడానికి అదో ఉదాహరణ.

**రోడ్లపై గోతులు పూడ్చలేదు**

అయిదేళ్లలో ఒక్క రోడ్డు వెయ్యలేదు.. కనీసం రోడ్డు పై గుంతలు పూడ్చలేదు. ఒక్క సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు.. రాయలసీమ కు వరం లా ఉన్న డ్రిప్ ఇరిగేషన్ ను కూడా రద్దు చేసారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితం ఇచ్చారు. కప్పుడు నీళ్లు పోసి కుప్పంకు నీరు ఇచ్చాం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ కు రెండుసార్లు శంకుస్థాపన చేసారే తప్ప ఒక్క ఇటుక పెట్టలేదు. విశాఖపట్నంలో 700 కోట్లతో రాయల్ ప్యాలస్ కట్టుకున్నారే తప్ప రైల్వే జోన్, విశాఖ ఉక్కు గురించి పట్టించుకోలేదు.

**అరాచకపాలనపై తిరుగుబాటు**

ఐదేళ్లు అరాచక పాలన సాగింది. దళిత బిడ్డల్ని చంపి డోర్ డెలివరీ చేసారు. మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధాకర్ ను వేటాడి, వెంటాడి చంపేసారు. అక్క ను వేధించిన వారిని ప్రశ్నించినందుకు బిసి బిడ్డ అమర్నాథ్ గౌడ్ పై పెట్రోల్ పోసి తగలబెట్టి చంపేసారు. ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, కేసులు, అరెస్టులు. విధ్వంస పాలన పై ప్రజలు తిరగబడి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నారు.

**ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది**

సుపరిపాలన లో మనం తొలి అడుగు వేసాం. ఐదేళ్లు రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వారు ప్రజా ప్రభుత్వం ఏడాదిలో ఏం సాధించింది అని అడుగుతున్నారు. నేను వారికి సూటిగా సమాధానం చెప్పాలి అనుకుంటున్నా. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు ప్రశాంతత వచ్చింది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల మొఖంలో చిరునవ్వు వచ్చింది. ప్రజా సంఘాలకు ప్రశ్నించే హక్కు వచ్చింది. నియంత పాలన నుండి ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది.

**5ఏళ్లలో సాధించలేనిది ఏడాదిలోనే!**

వాళ్లు ఐదేళ్లలో సాధించలేనిది మనం ఏడాదిలో సాధించాం. అన్ని సమస్యలు పరిష్కరించేసాం అని నేను చెప్పడం లేదు. ఇంకా చెయ్యాల్సింది ఎంతో ఉంది. గత ప్రభుత్వానికి వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు పట్టింది. మన చంద్రన్న కేవలం ఒకే ఒక్క సంతకంతో పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచారు. దేశంలో ఏ రాష్ట్రము 4 వేల పెన్షన్ ఇవ్వడం లేదు. దివ్యాంగులకు 6 వేలు, పూర్తిగా బెడ్ కే పరిమితం అయితే 15 వేలు ఇస్తున్నాం. 67,27,164 మంది విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేసాం. 8745 కోట్లు తల్లుల ఖాతాల్లో వేసాం. మొదటి తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం లో చేరే విద్యార్థులకు త్వరలోనే పథకాన్ని అమలు చేస్తాం.

**ఆగస్టు 15నుంచి మహిళలకు ఫ్రీబస్**

గత ప్రభుత్వం పేదవారి ఆకలి తీర్చే అన్న క్యాంటిన్లు మూసేసారు. ప్రజా ప్రభుత్వం 203 అన్న క్యాంటిన్లు తిరిగి ప్రారంభించింది. దీపం పథకం ద్వారా కోటి సిలిండర్లు ఉచితంగా మహిళలకు అందజేశాం. గత ప్రభుత్వం ఒక్క డిఎస్సి పోస్టు కూడా భర్తీ చెయ్యలేదు. ప్రజా ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేస్తూ మెగా డిఎస్సి నిర్వహిస్తున్నాం. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆగష్టు 15న మహిళలకు ఫ్రీగా బస్సు ప్రయాణం అమలుచేస్తాం. గత పాలకులు ప్రజల ఆస్తులు కొట్టేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొస్తే దానిని మన ప్రజా ప్రభుత్వం రద్దు చేసింది. గత ప్రభుత్వం చెత్త మీద పన్ను వేస్తే మన ప్రజా ప్రభుత్వం చెత్త పన్ను ఎత్తేసింది.

**పేదరికంలేని సమాజం బాబు లక్ష్యం**

పేదరికం లేని సమాజం చూడాలనేది చంద్రబాబు గారి లక్ష్యం. పీ4 కాన్సెప్ట్ తీసుకొచ్చారు. సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడమే పీ4. బంగారు కుటుంబాలకు చేయూత అందిస్తున్న మార్గదర్శులకు నా ధన్యవాదాలు. పవనన్న ఆధ్వర్యంలో పంచాయతీలకు స్వాతంత్ర్యం వచ్చింది. పంచాయితీలకు వెయ్యి కోట్లు నిధులు విడుదల చేసాం. రైతుల నుండి 56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం, 13,600 కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో పెట్టిన 1700 కోట్ల బకాయిలు కూడా మనమే తీర్చాము. పొగాకు, మిర్చి, కోకో రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకుంటుంది ప్రజా ప్రభుత్వం.

**అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండా**

అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజా ప్రభుత్వం ఎజెండా. కేవలం ఏడాది లోనే 9.5 లక్షల కోట్ల పెట్టుబడులు, 8.5 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపిస్తున్నాం. రాయలసీమ ను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, హార్టీ కల్చర్ హబ్ గా తయారు చేస్తున్నాం. ఎల్జీ ఎలక్ట్రానిక్స్, రెన్యూ లాంటి కంపెనీలు వచ్చాయి. ప్రకాశం జిల్లా లో రిలయన్స్ సిబిజి ప్లాంట్లు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వా. ఉత్తరాంధ్ర లో ఐటీ, ఫార్మా, మెడికల్ ఎక్విప్మెంట్ తయారీ, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, టిసిఎస్ లాంటి కంపెనీలు వస్తున్నాయి.

**డబుల్ ఇంజన్ సర్కార్ పవర్!**

డబుల్ ఇంజిన్ సర్కార్ మన పవర్. ప్రధాని నరేంద్ర మోదీ గారు రాష్ట్రం అడిగిన ప్రతి కోరిక తీరుస్తున్నారు. గత ప్రభుత్వం నాశనం చేయాలనుకున్న అమరావతిని డబుల్ స్పీడ్ తో పట్టాలెక్కించాం, 60వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. రాజధానికి 15వేల కోట్లు, పోలవరానికి 12వేల కోట్లు ఇచ్చారు ఏడాదిలోనే పోలవరం పనులు 8శాతం పూర్తి చేశాం, విశాఖ స్టీల్ ప్లాంట్ కి 11,500 కోట్లు సాయం అందించారు. ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్ ల అభివృద్ధికి 5వేలకోట్లు ప్రకటించారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సహకరించారు. కర్నూలు లో హై కోర్టు బెంచ్ ఏర్పాటు కు సహకరిస్తున్నారు. ఐదేళ్ల లో గత ప్రభుత్వం సాధించలేనివి ప్రజా ప్రభుత్వం ఏడాదిలో సాధించింది. డబుల్ ఇంజన్ సర్కారు వల్లే ఇవన్నీ సాధ్యమయ్యాయి.

**విద్యాశాఖలో సంస్కరణలు**

విద్యా శాఖ మంత్రిని నా శాఖ లో సంస్కరణలు తెస్తున్నా. రాజకీయాలకు అతీతంగా విద్య వ్యవస్థ ఉండాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యం. గత పాలనలో ఫోటోలు రంగుల పిచ్చి మీరంతా చూసారు. యూనిఫామ్ దగ్గర నుండి చిక్కీ వరకూ పార్టీ రంగులు, ఫోటోలు. ఫీజు రీయింబర్స్మెంట్ నుండి చిక్కీల వరకూ 6500 కోట్ల బకాయిలు నా నెత్తి మీద పోయారు. బకాయిలన్నీ క్రమ పద్దతిలో చెల్లిస్తున్నాం. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టాం. స్టూడెంట్ కిట్ కి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పేరు పెట్టాం. గత ప్రభుత్వ పాలనలో 1200 స్కూళ్లు వన్ క్లాస్ ... వన్ టీచర్ ఉంటే ఇప్పుడు 9800 స్కూల్స్ లో వన్ క్లాస్... వన్ టీచర్ పెంచాం.

**కరిక్యులమ్ లో మార్పులు**

కేజీ నుండి పీజీ వరకూ కరికులం మారుస్తున్నాం. బ్యాగ్ బరువు తగ్గించడానికి సెమిస్టర్ వైస్ డివైడ్ చేసి పుస్తకాలు సిద్ధం చేసాం. పుస్తకాల దగ్గర నుండి చిక్కీ వరకూ ఎక్కడ పార్టీల రంగులు లేవు, నాయకులు రంగులు లేవు, ముఖ్యమంత్రి గారి ఫోటోలు లేవు, నా ఫోటోలు లేవు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు చాగంటి కోటేశ్వర రావు గారిని సలహాదారునిగా నియమించాం. ఆయన నైతిక విలువల పై చక్కటి వీడియోలు, పుస్తకాలు సిద్ధం చేసారు. మహిళల్ని గౌరవించాలి అని విద్యార్థి దశ నుండే నేర్పిస్తున్నాం.

**ఉద్యోగస్తులకు హ్యాట్సాఫ్!**

ఉద్యోగస్తులు ప్రభుత్వానికి గుండెకాయ. సీఎస్ గారి దగ్గర నుండి క్షేత్ర స్థాయిలో పనిచేసే చిన్న ఉద్యోగి వరకూ గత ఏడాది కాలం కష్టపడి పనిచేసారు. ప్రభుత్వ ఉద్యోగస్తులందరికీ హ్యాట్సాఫ్. ముఖ్యంగా నా టీచర్లు పూర్తి స్థాయిలో నాకు సహకారం అందించారు. గత ప్రభుత్వం ఉద్యోగస్తులను ఎలా అవమానించారో అందరూ చూసాం. ఉపాధ్యాయులను మద్యం షాపుల ముందు క్యూ లైన్ కంట్రోల్ చెయ్యమని నిలబెట్టారు. జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. అనేక హామీలు ఇచ్చి ఉద్యోగస్తులను గత ప్రభుత్వం మోసం చేసింది. ఇప్పుడు ఏదైనా సమస్య వస్తే కూర్చొని మాట్లాడుకుంటున్నాం.

**ప్రజలకు చేరువగా ఉండండి!**

దేవుడు కూడా అన్ని సమస్యలు తీర్చలేడు. అవకాశం ఉన్నంత వరకూ సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ప్రభుత్వం పెట్టి పోయిన బకాయిలు చెల్లిస్తున్నాం. ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగస్తుల సహకారం ఎంతో అవసరం. నేను 65 ప్రజా దర్బార్లు నిర్వహించాను. ప్రతి రోజు ప్రజల్ని కలుస్తున్నాను. ఆ ఫైల్స్ అన్ని మంత్రులకు ఇచ్చి రిక్వెస్ట్ చేస్తున్నాను. ప్రభుత్వ అధికారులు కూడా ప్రజలకు మరింత దగ్గర అవ్వాలి. అనేక సమస్యలతో వారు మీ దగ్గరకు వస్తారు. వారిని ఆప్యాయంగా పలకరించి సమస్య పరిష్కారం కోసం కృషి చేయండి. ఉద్యోగస్తులు తలుచుకుంటే స్వర్ణాంధ్ర ఖచ్చితంగా సాధ్యం అవుతుంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒకటి గుర్తుపెట్టుకోవాలి. గత పాలకుల అహంకారం, అరాచకంతో 151 - 11 అయ్యింది. కాలర్ ఎగరేసి తిరగడం కాదు, ఒళ్లు దగ్గర పెట్టుకొని ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని మంత్రి లోకేష్ అన్నారు.

# మాది మంచి ప్రభుత్వం... మెతక ప్రభుత్వం మాత్రం కాదు

**పిచ్చి పిచ్చి మాటలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం**

**తలలు నరికేస్తాం... గొంతులు కోస్తాం అనే డైలాగ్స్ సినిమాల్లోనే బాగుంటాయ్**

**అధికారం కోల్పోయినా వైసీపీ నాయకుల్లో మార్పు రాలేదు**

**మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం**

**ఏడాది కాలంలో రూ. 9.4 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం**

**యోగాంధ్ర, గ్రామ సభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించాం**

**మరో 20 ఏళ్ళు వైసీపీ ఇక రాదు... రాబోదు**

**'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్**



అమరావతి జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

'అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి అరాచకాలు సృష్టించారో... ఇప్పుడూ అలాంటి విధానాలనే గత పాలకులు కొనసాగిస్తున్నారు. గొంతులు కోస్తాం... తలలు నరికేస్తాం వంటి బెదిరింపులకు, తాటాకు చప్పుళ్లకు భయపడేవారు ఎవరూ లేరు ఇక్కడ! పిచ్చిపిచ్చిగా మాట్లాడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేద'ని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాది మంచి ప్రభుత్వం... మెతక ప్రభుత్వం మాత్రం కాదని స్పష్టం చేశారు. శాంతిభద్రాలకు విఘాతం కలిగించేవారిని కచ్చితంగా కట్టడి చేస్తామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో సోమవారం సాయంత్రం రాజధాని అమరావతిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు శ్రీమతి పురందేశ్వరి గారు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి శ్రీ నారా లోకేష్ గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ విజయానంద్ గారితో కలిసి శ్రీ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "గత పాలకులు అధికారంలో లేకపోయినా రౌడీయిజం, అసాంఘిక విధానాల్లో ఏ మాత్రం మార్పురావడం లేదు. వాళ్లకు ప్రజాస్వామ్య విధానాలపై అసలు గౌరవమే లేదు. అధికార యంత్రాంగంపై బెదిరింపులకు దిగుతున్నారు. ఖండాలు దాటి వెళ్లినా పట్టుకొస్తామని వార్నింగ్ ఇస్తున్నారు. ఇలా బెదిరించే వాళ్లకు మేము ఒకటే చెబుతున్నాం. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బెదిరిపోయే వాళ్లు కూటమి ప్రభుత్వంలో ఎవరూ లేరు. మళ్లీ వైసీపీ వస్తే మా పరిస్థితి ఏంటి అనే ఆలోచన అవసరం లేదు. మరో 20 ఏళ్లు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. కూటమి ఐక్యతను చెడగొట్టే పరిస్థితుల్లో ఎవరూ లేరు. మరో 20 ఏళ్ల వరకు వైసీపీ ప్రభుత్వం రాదు... రావట్లేదు. సజ్జనుడికి కోపం వస్తే అడవి దహనం అవుతుంది. మాది మంచి ప్రభుత్వం మెతక ప్రభుత్వం కాదు. సమర్థవంతమైన ప్రభుత్వం... రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే ప్రభుత్వం. ఎవరైనా పిచ్చి పిచ్చి వేషాలు వేసి, ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదు. అలాంటి వారిని తొక్కి నార తీస్తాం. మేం చట్టబద్ధంగా వ్యవహరించాలి కాబట్టి పద్ధతిగా మాట్లాడుతున్నాం.

**కూటమి ప్రభుత్వం రాకుంటే ఏపీ ఏమయ్యేదో..?**

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. చాలా కష్టాలు, ఒత్తిళ్లు మధ్య పాలన చేపట్టాం. రాష్ట్ర విభజన జరిగినప్పుడు నుంచి ఆంధ్రప్రదేశ్ బాగుకోసం ఆలోచించాను. 2019లో ప్రభుత్వం మారిన వెంటనే విధ్వంస పాలన మొదలైంది. బూతులు తిట్టడం, భయపెట్టడం పరిపాటిగా మారింది. ప్రశ్నించే వారిని ఏదో ఒక నెపం పెట్టి జైల్లో పెట్టాలని చూశారు. ఏదైనా మాట్లాడదాం అంటే రౌడీమూకలు దాడులకు తెగపడేవారు. అధికార యంత్రాంగం భయం గుప్పెట్లో చిక్కుకుపోయింది. వీటన్నింటి మధ్య రాష్ట్రం విలవిలలాడిపోయింది. ఇలాంటివన్ని ప్రజాహితం కోరుకునే ప్రతి ఒక్కరిని ఆందోళనకు గురి చేసింది. వైసీపీ పాలనలో ప్రతి ఒక్కరు చాలా ఇబ్బందిపడ్డారు. విశాఖపట్నంలో నన్ను బయటకు రానివ్వలేదు. యువగళం పాదయాత్ర సమయంలో మంత్రి శ్రీ లోకేష్ గారిని ఇబ్బంది పెట్టారు. చివరకు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారిని వదల్లేదు. వైసీపీ పాలన చూశాక రాష్ట్రానికి అసలు వెలుగు వస్తుందా? అని అనుకున్నా. కూటమి ప్రభుత్వం రాకుంటే రాష్ట్రం ఏమయ్యేదో అనిపించింది. ప్రజలకు సుపరిపాలన అందించాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్తే ప్రజలు ఆశీర్వదించారు. కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడ్డారు.

**ఆకలి తీరుస్తున్నాం... ఆర్థిక భరోసా కల్పిస్తున్నాం**

గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు కేంద్రం నుంచి అందిస్తున్న సహాయ సహకారాలతో, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి పాలనా దక్షతతో, మంత్రివర్గ సహచరుల మద్దతుతో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047, వికసిత్ భారత్ లక్ష్యాల సాధన దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. యోగాంధ్రతో ప్రపంచ రికార్డు సృష్టించాం. ఆర్థిక పరిస్థితి అనుకూలించకున్నా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ అధికారం చేపట్టిన వెంటనే గత ప్రభుత్వంలో రూ.3 వేలుగా ఉన్న పింఛనును రూ.4 వేలకు పెంచాం. దివ్యాంగులకు ఇచ్చే పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలు చేశాం. తీవ్ర అనారోగ్యంతో మంచానికి పరిమితం అయిన వారికి రూ. 5 వేల నుంచి రూ.15 వేలకు పెంచి ఆర్థిక భరోసా కల్పించాం. గత ప్రభుత్వం సామాజిక పింఛన్ల కోసం నెలకు రూ.1,939 కోట్లు వెచ్చిస్తే.. కూటమి ప్రభుత్వం రూ. 2,717 కోట్లు ఖర్చు చేస్తూ.. 63 లక్షల మందికి చేయూత ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 204 అన్న క్యాంటిన్లు ప్రారంభించి సగటున రోజుకు 3 లక్షల మంది ఆకలి తీరుస్తున్నాం. దీపం 2 పథకం ద్వారా తొలి విడత 1.15 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాం. ఈ పథకం కోసం ఐదేళ్లలో రూ. 13,423 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయనున్నాము. వేట విరామ సమయంలో మత్స్యకారులకు అందించే భృతిని రెండితలు చేసి ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున అందిస్తున్నాం.

**ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు పెట్టాం**

గత పాలకుడు ప్రతి పథకానికి తన పేరో... లేకపోతే వారి తండ్రిగారి పేరో పెట్టేవారు. కూటమి పాలనలో మాత్రం ఎవరైతే సమాజానికి సేవ చేశారో వారి పేర్లను పథకాలకు పెడుతున్నాం. శ్రీ లోకేష్ గారి నేతృత్వంలోని విద్యా శాఖలో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టాం. విద్యార్థుల స్కూల్ కిట్లుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి పేరు పెట్టాం. తల్లికి వందనం పథకం ద్వారా 67 లక్షల మంది విద్యార్థులకు లబ్ది చేకూర్చాం. గత ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట యువతను దగా చేస్తే ... కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 16,347 ఉపాధ్యాయ నియామకాలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. 6,100 పోలీస్ ఉద్యోగాల నియామకాలకు చర్యలు తీసుకున్నాం. వైసీపీ హయాంలో ఉపాధి కోసం యువత పక్క రాష్ట్రాలకు వలస బాట పట్టగా, కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చి భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలబడ్డాం. ఏడాది కాలంలో బ్రాండ్ ఏపీని పునరుద్ధరించడం ద్వారా రూ. 9.4 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. తద్వారా 6 లక్షల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం అవుతుంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాం. గత ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సబ్ ప్లాన్ నిధులను సైతం ఇష్టారాజ్యంగా మళ్లించి వెనుకబడిన వర్గాల వారికి ద్రోహం చేసింది. కూటమి ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టి ఆయా వర్గాల స్వయం ఉపాధి పథకాలకు వెచ్చిస్తోంది.

**మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చాం**

గత ఐదేళ్లలో గజానికో గుంతగా మారిన రాష్ట్ర రహదారులకు పునరుజ్జీవం నింపుతూ 20 వేల కి.మీ రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సర్పంచులు తలెత్తుకునేలా చర్యలు తీసుకున్నాం. జాతీయ పండుగలైన స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఇచ్చే నిధులను మైనర్ పంచాయతీలకు రూ.100 నుంచి రూ.10 వేలకు, మేజర్ పంచాయతీలకు రూ.250 నుంచి రూ.25 వేలకు పెంచాం. గ్రామ స్వరాజ్య సాధన లక్ష్యంలో భాగంగా ఒకే రోజు 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించాం. పల్లె పండుగ ద్వారా గ్రామీణ రహదారులకు కొత్త కళ తీసుకువచ్చాం. రైతులకు అండగా మినీ గోకులాలు, నీటి కుంటలు అనతి కాలంలోనే తవ్వించాం. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షల 94 వేల కుటుంబాల్లో 75 లక్షల 23 వేల మంది ఉపాధి శ్రామికులకు వారి సొంత గ్రామాల్లోనే ఉపాధి కల్పించాం. 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో 5.10 లక్షల కుటుంబాలకు 100 రోజుల పని కల్పించాం. అడవి తల్లి బాట కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పిస్తున్నాం. రూ. 1,005 కోట్లతో గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 1069 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.

**అటవీ విస్తీర్ణం పెంచే దిశగా ప్రణాళికలు**

రాష్ట విస్తీర్ణంలో ప్రస్తుతం 30 శాతంగా ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 2029 నాటికి 37 శాతానికి పెంచే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నాం. రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో ఏనుగుల బెడదను పరిష్కరించడానికి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకువచ్చాం. ఇప్పటికే నాలుగు కుంకీ ఏనుగులు పలమనేరు క్యాంపుకి చేరగా, మరో రెండు త్వరలో రానున్నాయి. ఎర్రచందనం అక్రమ రవాణాని అరికట్టేందుకు కఠిన చర్యలు అమలు చేయడంతో పాటు అక్రమంగా తరలిపోతున్న ఎర్రచందనాన్ని తిరిగి తెచ్చుకునే విధంగా కర్ణాటక రాష్ట్రంతో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఏకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాం. రూ. 1,122 కోట్లతో 61 నగర వనాలను అభివృద్ధి చేస్తున్నాం. వన మహోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటాం. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోనూ విద్యార్థులకు ప్రోత్సహకాలు అందించే విధంగా వేగంగా ముందడుగు వేస్తున్నాం.

**రూ. 308 కోట్లతో పిఠాపురం అభివృద్ధి**

నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా గడచిన ఏడాది కాలంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టాము. ఏడాది కాలంలో రూ.308 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టాము. వచ్చే నాలుగేళ్లలో గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో, ముఖ్యమంత్రివర్యులు శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో మరింత ప్రగతి సాధిస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు హాజరయ్యారు.




# ఏపీ విద్యావ్యవస్థలో కూటమి ప్రభుత్వం

## గొప్ప సంస్కరణలు తీసుకొచ్చింది

మంత్రి లోకేశ్




బాపట్ల జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


**బాపట్ల: కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో గొప్ప సంస్కరణలను తీసుకువచ్చిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లులో మంత్రి లోకేశ్ పర్యటించారు. ఇంకొల్లులోని గంగవరం రహదారిలోని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు నిర్మించిన డీవీఆర్ సైనిక్ స్కూల్‌ను లోకేశ్ ప్రారంభించారు. విలువలతో కూడిన విద్యను అందించడం కోసమే ఈ సైనిక్ స్కూల్ ప్రారంభించినట్లు ఎంపీ పురందేశ్వరి తెలిపారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు దేశభక్తిని అలవరుచుకోవాలని సూచించారు.**

"ఏపీకి పెద్ద ఎత్తున సీఎం చంద్రబాబు పెట్టుబడులు తీసుకువస్తున్నారు. రాబోయే కాలంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. అన్ని రంగాల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంచేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారు. రాజకీయాల్లో మార్పు రావాలంటే యువత రాజకీయాల్లోకి రావాలి"అని మంత్రి లోకేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు సాంబశివరావు, ఎంఎం కొండయ్య యాదవ్, నరేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజధానిలో భూకేటాయింపులపై

# మంత్రివర్గ ఉపసంఘం భేటీ

అమరావతి జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఏపీ సచివాలయంలో భూ కేటాయింపుల అంశంపై మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. మంత్రులు నారాయణ, టీజీ భరత్ హాజరయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రాజధానిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.

రాజధాని ప్రాంతంలో 16 అంశాల భూకేటాయింపుల అజెండాపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించిందని మంత్రి నారాయణ తెలిపారు. వీటిలో 12 అంశాలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఇప్పటి వరకు కేటాయించిన భూముల్లో 6 నెలల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చూస్తున్నామన్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటివరకు ఇచ్చిన అన్ని వర్క్స్ టేకాఫ్ అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం అమరావతిలో 10వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు.

# చర్చలు, దౌత్యంతో ఉద్రిక్తత సడలించుకోండి

## ఇరాన్ అధ్యక్షుడిని ఫోన్లో కోరిన మోదీ

న్యూఢిల్లీ, జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉద్రిక్తతల్ని సడలించుకోవాలని పిలుపునిచ్చారు. ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆదివారం మోదీతో ఫోన్లో మాట్లాడారు.

ప్రస్తుత దాడులను ఆపేయాలని, శత్రుత్వాన్ని తగ్గించుకోవాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. ప్రాంతీయంగా వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరతలను పునరుద్ధరించాలంటే చర్చలే మార్గమని గట్టిగా చెప్పారు. ప్రస్తుత పరిస్థితిపై ఇరువురూ సమగ్రంగా చర్చించుకున్నామని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. శాంతి, మానవత్వాల వైపే భారత్ ఉంటుందని చెప్పారు. భారతీయుల్ని ఇరాన్ నుంచి క్షేమంగా తీసుకురావడంలో పెజెష్కియాన్ అందిస్తున్న నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. వాణిజ్యం, ఆర్థిక సహకారం, శాస్త్ర-సాంకేతిక రంగాలు, ప్రజల మధ్య సంబంధాల విషయంలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకునేలా పనిచేసేందుకు కట్టుబాటును ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. తరచూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్నారు.

# 4




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 24 జూన్ 2025


# వాడపల్లిలో ఘనంగా బలిదాన్ దివస్.

**-డా.శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళులు.**





ఆత్రేయపురం, జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయ నేత డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జ్ఞాపకార్థంగా బిజెపి ఆధ్వర్యంలో సోమవారం ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి గ్రామంలో బలిదాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బిజెపి మండల అధ్యక్షుడు యు. వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా, బూత్ అధ్యక్షుడు పడాల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన గుంటూరు జిల్లా ఇన్చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి, డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ చరిత్రలో శ్యామాప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తిదాయకమైన నాయకుడు. భారతీయ జాతీయతకు, సాంస్కృతిక విలువలకు పరిరక్షణకై ఆయన చేసిన త్యాగం మరవలేనిది. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిసాన్ నహీ చలేగా అంటూ భారత్ ఏకత్వానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచారు. కాశ్మీర్‌కి ప్రత్యేక హోదా వ్యతిరేకంగా పోరాడి, ఆ పోరాటంలో ప్రాణత్యాగం చేశారు. మనమంతా ఆయన అడుగుజాడల్లో నడవాలి అన్నారు. ఈ సందర్భంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జీవితం, ప్రజల కోసం చేసిన కృషి గురించి వివరణాత్మకంగా కార్యకర్తలకు తెలియజేశారు. ఆయన్ను గుర్తు చేసుకుంటూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, రాష్ట్ర యువమోర్చ కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ అల్లు భాస్కరరావు, కిసాన్ మోర్చా జోనల్ ఇన్చార్జి చేకూరి రమేష్ వర్మ, ముదునూరి వెంకట సూర్యనారాయణరాజు, సాధనాల సూర్యనారాయణ, పడాల లక్ష్మిగణపతి, అల్లు త్రిమూర్తులు, సాధనాల సుబ్బారావు, యార్లగడ్డ ఆనందరావు, గూడూరి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి శ్రేణులు ఈ కార్యాక్రమం చేపట్టినట్లు పార్టీ మండల అధ్యక్షుడు యు వెంకటేశ్వరరావు తెలిపారు.

# వైసీపీ కార్యకర్త సింగయ్య మృతి చాలా బాధాకరం.

**-అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి.**



రావులపాలెం, జూన్ 23: (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కార్యకర్త సింగయ్య మృతి పట్ల అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన బాధాకరమని, పార్టీకి తీరని లోటు జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఘాటుగా స్పందించిన జగ్గిరెడ్డి సింగయ్య మృతికి ముమ్మాటికి బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. జగన్ మోహన్ రెడ్డికి తగిన భద్రత కల్పించకపోవడమే ఇందుకు కారణమని. రోప్ పార్టీ ఏర్పాటుపై నిర్లక్ష్యం చూపారని ఆరోపించారు. ఇక ఈ ఘటనలో 1 గా సీఎం చంద్రబాబు, 2 గా హోంమంత్రి, 3 గా డీజీపీ బాధ్యులుగా చేర్చాలంటూ ఆయన డిమాండ్ చేశారు. ఇక మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా ఖర్చు చేస్తుందని ఆరోపిస్తూ యోగేంద్ర కార్యక్రమానికి రూ.300 కోట్లు ఖర్చు చేయడం పూర్తిగా ప్రజల సొమ్మును వృథా చేయడమే అని విమర్శించారు. ప్రముఖ సినిమా డైలాగ్‌ను ఉదహరిస్తూ ఆయన ఒక సినిమాలో బావ కళ్లల్లో ఆనందం చూడాలని మర్డర్ చేశానని చెప్పే డైలాగ్ ఉంటుంది. ఇప్పుడు రాష్ట్రాన్ని మర్డర్ చేస్తున్న దుష్టచతుష్టయం చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ కలిసి ప్రధాని మోదీ బావ కళ్ళల్లో ఆనందాన్ని చూడాలని పనిచేస్తున్నారు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం చెప్పిన 48 గంటలు కాదు 48 రోజులు గడుస్తున్నా, రైతుల పంట బకాయిలు ఇప్పటివరకు చెల్లించని దుస్థితిని కూడా ఆయన ఎత్తిచూపారు. ఈ వ్యాఖ్యలు స్థానికంగా రాజకీయ దుమారం రేపుతున్నాయి. సింగయ్య మృతిపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించి, బాధ్యులను శిక్షించాలన్న డిమాండ్ జగ్గిరెడ్డి చేశారు.

# జమిందార్ కాంప్లెక్స్‌లో పేకాట శిబిరంపై దాడి

**రూ.2.04 లక్షల నగదు స్వాధీనం.10 మంది అరెస్ట్.**




రావులపాలెం, జూన్ 23:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రావులపాలెం మండలం రావులపాలెం శివారు ఈతకోట సమీపంలోని మల్లాయిదొడ్డి జమిందార్ కాంప్లెక్స్‌లో పేకాట శిభిరం నిర్వహిస్తున్న సమాచారంతో ఆదివారం రావులపాలెం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. సీఐ శేఖర్ బాబు నేతృత్వంలో సాగిన ఈ సోదాలో పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2,04,500 నగదు, పేక కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రావులపాలెం టౌన్ లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నవని, శిభిరం గత కొంతకాలంగా నడుస్తోందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. జమిందార్ కాంప్లెక్స్ పేకాట కేంద్రంగా మారిపోయిందని, పోలీసుల దృష్టికి ఎప్పటినుండో వస్తున్నప్పటికీ తాజాగా దాడి జరగడం గమనార్హం. పేకాట శిభిరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ప్రాంతాన్ని పూర్తిగా పర్యవేక్షణలోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**" సుపరిపాలన- తొలిఅడుగు" కార్యక్రమంలో పాల్గొన్న**

# ఎమ్మెల్యే అయితాబత్తుల





విజయవాడ జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విజయవాడలోని జరుగుతున్న " సుపరిపాలన- తొలిఅడుగు" కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ రవిరాల మహేష్, ఎస్పీ, ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం నల్లా చిట్టి, తదితరులు పాల్గొన్నారు




# చంద్రబాబు నాయకత్వంలో పార్టీ సారధులు సైనికుల్లా పని చేయాలి.

**-ఎమ్మెల్యే బండారు**

కొత్తపేట: జూన్ 23,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ నూతన బూత్, యూనిట్, క్లస్టర్, గ్రామ, మండల కమిటీల ఎంపిక ప్రక్రియ ఆదివారం కొత్తపేట నియోజకవర్గం లోని ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు, రావులపాలెం మండలాల్లో పార్టీ పరిశీలకుల సమక్షంలో పూర్తయింది. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన సారధులను పరిచయం చేస్తూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో నూతన కమిటీల్లో నియమితులైన నాయకులు సైనికుల్లా కృషి చేసి పార్టీని బలోపేతం చేయాలి అని పిలుపునిచ్చారు. ఇవే కమిటీల్లో భాగంగాఆత్రేయపురం మండల టీడీపీ అధ్యక్షుడిగా కూసంపూడి రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా గుడేల నాగేంద్ర, కొత్తపేట మండల అధ్యక్షుడిగా గనిశెట్టి వీరేష్, కార్యదర్శిగా కడలి భీమేశ్వరరావు, ఆలమూరు మండల అధ్యక్షుడిగా ఈదల సత్తిబాబు, కార్యదర్శిగా సలాది నాగేశ్వరరావు, రావులపాలెం మండల అధ్యక్షుడిగా కొప్పిశెట్టి ప్రసాద్, కార్యదర్శిగా జక్కంపూడి బాలాజీ బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రక్రియను పార్టీ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, పెంకె వెంకటేష్, కొల్లాబత్తుల అప్పారావు, సూదా బాబ్జి, యరగటపు బాబ్జి, చిట్టూరి శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్ పర్యవేక్షించారు. క్లస్టర్ ఇంచార్జిలుగా ముదునూరు వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కరటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, కముజు గంగాధర్ రావు, గుత్తుల పట్టాభిరామారావు, జక్కంపూడి వెంకటస్వామి, కాసా సాగర్, మాసాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# నిత్య పెళ్లికూతురిపై ఎస్పీకి ఫిర్యాదు



అమలాపురం, జూన్ 23(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

12 పెళ్లిళ్లు చేసుకున్న నిత్య పెళ్లి కూతురిపై అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బి. కృష్ణారావుకు సోమవారం నాడు బాధితులు ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం గ్రామానికి చెందిన బేతి వీర దుర్గ నీలిమ, ఆమె తల్లి బేతి వీరలక్ష్మి, రామకృష్ణ, కళ్యాణ్ లు ఆర్థిక స్థిరత్వం కలిగి విడాకులు తీసుకున్న పురుషులను టార్గెట్ గా చేసుకుని మోసం చేస్తున్నారు. సెక్షన్ 498 కేసులు ఎదుర్కొంటున్న పురుషులు వీరు చేసిన మోసాలకు బలవుతున్నారు. విడాకులు తీసుకుని డిప్రెషన్ లో ఉన్న పురుషులకు మాయ మాటలు చెప్పి వివాహం వరకు తీసుకువెళతారు. ఈ లోపు వారి నుండి అందిన కాడికి డబ్బును దోచుకుంటారు. బాధితులు తిరగబడితే తప్పుడు కేసులు పెట్టి వేధించే వారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 12 మంది పురుషులను మోసం చేసి లక్షల్లో డబ్బులు వసూలు చేసుకుని పరారయ్యారు. ఇటీవల నిత్య పెళ్ళి కూతురు బేతి వీర దుర్గా నీలిమపై కేసులు నమోదు కావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. సోమవారం నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరు పట్టణాలకు చెందిన ముగ్గురు బాధితులు జిల్లా ఎస్పీ కృష్ణారావును కలిసి ఫిర్యాదు చేశారు. తమలాగ మరి ఎవరూ మోసపోకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసామన్నారు. నిత్య పెళ్లికూతురు కాజేసిన సొమ్మును తిరిగి తమకు ఇప్పించాలని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# తహసిల్దార్‌గా సుబ్బలక్ష్మి బాధ్యతల స్వీకరణ



కాట్రేనికోన, జూన్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కాట్రేనికోన మండల తహసిల్దార్ గా ఎం.వి సుబ్బలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముమ్మిడివరం మండలం నుండి బదిలీ పై ఇక్కడికి వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ తహసిల్దార్ గా పనిచేసిన సునీల్ కుమార్ మామిడికుదురు మండలం బదిలీపై వెళ్ళారు. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు

# టీడీపీ నూతన కమిటీల సారధులు సైనికుల్లా పనిచేయాలి

**- కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు**



రావులపాలెం, జూన్ 23, :(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీ నూతన కమిటీల సభ్యులు చంద్రబాబు సారధ్యంలో సైనికుల్లా పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం, కొత్తపేట, ఆలమూరు, రావులపాలెం మండలాలకు సంబంధించి ఎంపికైన పార్టీ నూతన కమిటీలను ఆదివారం పార్టీ పరిశీలకులు ప్రకటించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, పెంకె వెంకటేష్, కొల్లాబత్తుల అప్పారావు, ఆత్రేయపురం మండల పరిశీలకులు సూదా బాబ్జి, కొత్తపేట మండల పరిశీలకులు యరగటపు బాబ్జి, ఆలమూరు మండల పరిశీలకులు చిట్టూరి శ్రీనివాస్, రావులపాలెం మండలం పరిశీలకులు మొల్లేటి శ్రీనివాస్ ఈ సమావేశంలో పాల్గొని పార్టీ నూతన సారధులను పరిచయం చేశారు. ఆత్రేయపురం మండల అధ్యక్షుడిగా కూసంపూడి రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా గుడేల నాగేంద్ర, కొత్తపేట మండలం అధ్యక్షుడిగా గనిశెట్టి వీరేష్, ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వర రావు, ఆలమూరు మండల అధ్యక్షుడిగా ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా సలాది నాగేశ్వరరావు, రావులపాలెం మండల అధ్యక్షుడిగా కొప్పిశెట్టి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జక్కంపూడి బాలాజీ ఎన్నికైనట్లు పరిశీలకులు ప్రకటించారు. అలాగే నాలుగు మండలాల బూత్ కమిటీలు, యూనిట్ కమిటీలు, క్లస్టర్, గ్రామ కమిటీలు, మండల పార్టీ అనుబంధ సంఘ కమిటీలను ప్రకటించారు. నూతనంగా ఎంపికైన వారిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. నూతన పార్టీ సారథులు పార్టీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్చార్జులు ముదునూరి వెంకటరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, కముజు గంగాధరరావు, గుత్తుల పట్టాభి రామారావు, జక్కంపూడి వెంకటస్వామి, కాసా విజయసాగర్, మాసాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# బస్సులో దొరికిన పర్స్ అధికారులకు అప్పగించి

**- నిజాయితీ చాటుకున్న విద్యార్థిని**



రావులపాలెం, జూన్ 23, :(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బస్సులో దొరికిన పర్స్ ను అధికారులకు అప్పగించి నిజాయితీ చాటుకుంది ఒక విద్యార్థిని. ఏపీఎస్ ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజర్ జి.జి.వి.రమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేమగిరికి చెందిన పల్లా శ్రీను సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సులో వేమగిరి నుంచి రావులపాలెం వెళ్తుండగా పర్స్ పోగొట్టుకున్నాడు. అయితే ఆ విషయం గమనించకుండా బస్సు దిగి వెళ్లిపోయాడు. అతను పోగొట్టుకున్న పర్స్ అదే బస్సులో ప్రయాణిస్తున్న ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన గంధం సుధ అనే కొత్తపేట ప్రభుత్వ కళాశాల విద్యార్థినికి దొరికింది. దీంతో ఆమె ఆ పర్స్ ను రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ జి.జి.వి.రమణకు అప్పగించారు. వివిధ రకాల బ్యాంకు కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డులు, రూ.8,100 నగదుతో ఉన్న ఆ పర్స్ ను డిఎం పల్లా శ్రీనుకు అందజేశారు. నిజాయితీ చాటుకున్న ఆ విద్యార్థినిని అంతా అభినందించారు.

# ఘనంగా బిల్వార్చన



ఐ పోలవరం జూన్ 23(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఐ పోలవరం మండలం మురమళ్ల గ్రామంలో నిత్యకళ్యాణం పచ్చుతోరణం గా విరాజిల్లుతున్న శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో జ్యేష్ఠ మాసం మాస శివరాత్రి మహా పర్వదినం పురస్కరించుకుని సోమవారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజ కార్యక్రమాలు జరిగాయి. తొలుత గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం బియవార్చన కార్యక్రమం జరిగింది. లక్ష పత్రి పూజలో 9 మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమీషనర్ కార్యనిర్వాహణాధికారి వి సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పిజిఆర్ఎస్ లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం.

## -పిజిఆర్ఎస్ లో 337 అర్జీల రాక.-జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.



ఏలూరు,జూన్,23, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా జిల్లా నలుమూలలు నుండి వచ్చిన అర్జీదారులు నుండి అర్జీలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్వీకరించారు.జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు,ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్ అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ లో 337 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటిజాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టరు సూచించారు.అందిన అర్జీలలో కొన్ని.కలిదిండి మండలం కొండంగి గ్రామానికి చెందిన దుగ్గిరాల పార్వతి.నా పంట భూమిని రీసర్వే చేశారని, కాని కొద్ది భూమిమిగిలి ఉంది, అదికూడా రీ సర్వే చేసి, హద్దులు నిర్ణయించి ఆన్లైన్ చెయ్యాలని కోరారు. ద్వారకాతిరుమల మండలం యం.నాగులపల్లి గ్రామానికి చెందిన బూసనబోయిన పెద్దిరాజు తాను నిరుపేదనని, తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామానికి చెందిన కె. బ్రహ్మరెడ్డి అర్జీనిస్తూ తన పేరున ఉన్న 70 ఏకరాలు భూమి ఇద్దరు కుమారులు తీసుకున్నారని, ఐనప్పటికీ వృద్ధాప్యంలో ఉన్న తనను చూడటం లేదని ఈ విషయంలో వృద్ధుల సంక్షేమ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్ టాప్ లు.

### -13 మంది దివ్యాంగులకు రూ. 4.68 లక్షల విలువైన ల్యాప్ టాప్ లు అందజేత.



ఏలూరు,జూన్,23, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఐ.టి.ఐ., పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ల్యాప్ టాప్ లను పంపిణీచేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆద్వర్యంలో రూ. 4.68 లక్షల విలువైన ల్యాప్ టాప్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ చదువులో లాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రెగ్యులర్ అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్ధినీ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ల్యాప్ టాప్ లు అందించి వారి విద్యకు దోహదపడుతుందన్నారు. దృష్టి లోపం, బధిరులు, చలన వైకల్యముకల విద్యార్ధినీ, విద్యార్థులకు వీటిని అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిబావంతుల శాఖ సహాయ సంచాలకులు బి. రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లైడ్ ఆఫ్ ఇండియా స్విమింగ్

### -ప్రతిభ చూపిన బలగ గణేష్ ను అభినందించిన జిల్లా కలెక్టర్.




ఏలూరు, జూన్, 23, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జూన్ 16వ తేదీన ఇంగ్లాండ్ దేశం (లండన్) నుండి ఫ్రాన్స్ దేశం వరకు 34 కి.మీ. దూరం ను అట్లాంటిక్ మహా సముద్రం లో ఇంగ్లీష్ ఛానెల్ ను రిలే ప్రక్రియ పద్ధతి లో ఆరుగురి బృందంతో ఫ్లైడ్ ఆఫ్ ఇండియా ఎ టీమ్ స్విమ్మింగ్ చేస్తూ 13:37 నిమిషాలు వ్యవధిలో విజయవంతంగా ముగించారు. అందులో భాగంగా మన ఏలూరు కి చెందిన బలగ గణేష్ కూడా ఆ బృందంలో కలిసి స్విమ్మింగ్ చేసి ప్రతిభ కనబరిచారు. అంతే కాకుండా ఇలా ఈత ఈదిన వారిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మొట్ట మొదటి పారా స్విమ్మర్ గా నిలిచి పతకం పొందిన బలగ గణేష్ ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అభినందించారు. అంతే కాకుండా బలగ గణేష్ ఏప్రిల్ 18 న శ్రీలంక నుండీ ఇండియా వరకు 28 కి.మీ దూరం ను పాక్ జలసంధి ను 10:30 నిమషాలు వ్యవధిలో పూర్తి చేసి తెలుగు రాష్ట్రాల్లో నే మొట్ట మొదటి పారా స్మిమ్మర్ గా రికార్డు నెలకోల్పడం అభినందనీయమన్నారు. బలగ గణేష్ ను అభినందించిన వారిలో జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, డిఎస్డివో బి.శ్రీనివాసరావు,తదితరులు ఉన్నారు.

## జాతరలు గ్రామశాంతిని కోరుకుంటాయి

### -మావుళ్ళమ్మ 40వ జాతర మహోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు





భీమవరం జూన్ 23, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమ్మవారి గ్రామోత్సవాలు, జాతరలు గ్రామశాంతిని కోరుకుంటాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 36వ వార్డులోని రామరాజు తోటలో మావుళ్ళమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి (చిన మావుళ్ళమ్మ) 40వ జాతర మహోత్సవాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని మాట్లాడారు. గత 40 ఏళ్లుగా సేవ సమితి సభ్యులు సంప్రదాయబద్ధంగా మావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ 5 రోజులపాటు జాతర మహోత్సవాలు జరుగుతాయని, 27న అన్న సమారాధన జరుగుతోందని అన్నారు. అనంతరం డప్పుల వాయిద్యాలు, గరగల నృత్యాలు, శక్తివేశాలతో అమ్మవారి జాతర కన్నుల పండువగా జరిగింది. మావుళ్ళమ్మ సేవా సమితి సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం

### -యువత సమస్యలపై వైఎస్సార్సీపీ యువత పోరు- జెసి రాహుల్ కు వినతిపత్రాన్ని అందించిన వైఎస్సార్ సిపి నాయకులు





భీమవరం జూన్ 23, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, ఏడాదికాలంగా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని వైఎస్సార్ సిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు చిగురుపాటి సందీప్ అన్నారు. వైఎస్సార్ సిపి యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్ సిపి యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విస్సాకోడేరు వంతెన నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఇంటికొక ఉద్యోగం అన్నారేగాని, ఇవ్వలేదని, ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ మోసం చేశారని, ఒక్కో నిరుద్యోగికి రూ 3 వేల భృతి ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఒక్క ఏడాదిలో నిరుద్యోగ భృతి బకాయిలు రూ 7200 కోట్లు అని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు యువత సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, కోడె యుగంధర్, కార్యదర్శి బలం శ్రీను, రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ సునీల్ వర్మ, జాయింట్ సెక్రటరీ రాజేశేఖర రెడ్డి, మానుకొండ ప్రదీప్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సూర్య, స్టూడెంట్ వింగ్ సెక్రటరీ రాహుల్, చందు, స్టూడెంట్ వింగ్ జిల్లా అధ్యక్షులు అభి వైఎస్సార్ సిపి యువజన విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### - డి.ఆర్.ఓ రాజకుమారి



అమలాపురం, జూన్ 23, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విచ్చేసే అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ తగు పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి అధికారులకు సూచించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి 242 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్ లో నమోదవుతున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ పెండింగ్ ఉండరాదన్నారు. అర్జీదారుల సమస్యను అధికారులు ఓపిగ్గా విని పరిష్కార మార్గాన్ని తెలపాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని అర్జీదారులలో కలిగించాలన్నారు. ప్రతివారం ముఖ్యమంత్రి చంద్రబాబు పి.జి.ఆర్.ఎస్ అర్జీల పరిష్కార సరళిపై సమీక్షించడం జరుగుతుందని కావున అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో సమస్యలకు తగు పరిష్కార మార్గాలు పూర్తిగా చూపాలన్నారు. ఈ కార్యక్రమంలోకలెక్టరేట్ ఏవో కాశీ విశ్వేశ్వర రావు, సర్వే ఏడి.కె ప్రభాకర్ డిఎండిఓ రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, ఎల్.డి ఎం.కేశవ వర్మ, సాంఘిక సంక్షేమ శాఖ జీడి పి.జ్యోతిలక్ష్మి దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ప్రతి గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

### -విద్యుత్తుశాఖ సూపర్డెంటు ఇంజనీరు పి.సల్మాన్ రాజు



ఏలూరు,జూన్ 23,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్థానిక రామచంద్రారావు పేట విద్యుత్తు సౌధ సమావేశ మందిరంలో సోమవారం పాత్రికేయుల సమావేశాన్ని విద్యుత్ శాఖ సూపర్డెంటు ఇంజనీరు పి.సల్మాన్ రాజు నిర్వహించారు.ఈ సందర్భంగా పి.సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజన పథకంలో భాగముగా గృహ విద్యుత్ వినియోగ దారులకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ఒక గొప్ప సువర్ణఅవకాశం అని ప్రతి గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రతి ఒక్కరూ ఇంటిపై సోలార్ ప్యానల్స్ ను సబ్సిడీపై ఏర్పాటు చేసుకోవాలని, అన్ని జాతీయ బ్యాంకులు తక్కువ వడ్డీకే సులభ వాయిదాలలో చెల్లించేలా లోను సౌకర్యము కల్పించుచున్నారని తెలిపారు.గృహ విద్యుత్ వినియోగ దారులను ప్రోత్సహించటానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ పానెల్స్ ఏర్పాటుకు మెదటి మరియు రెండవ కిలోవాట్ కి ప్రతి కిలోవాట్ కి రూ.30 వేలు,రెండు కిలో వాట్ రూ 60 వేలు, మూడవ కిలోవాట్ కి రూ 78 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇవ్వటం జరుగుచున్నదని తెలిపారు.గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసుకున్న తరువాత నెలకు మూడు కిలోవాట్ ఉన్నవారు 432 యూనిట్లు గరిష్టముగా ఉత్పతి చేయవచ్చు నని,దీని వల్ల కరెంటు బిల్లు నందు సుమారు రూ.2,860 వరకు ఆదా చేసుకోనచ్చునని తెలిపారు. అంతేకాకుండా మనము వినియోగించిన యూనిట్లుకు పోను మిగిలిన యూనిట్లు ఏమైయినా ఉంటే వాటికి అదనముగా ప్రతీ యూనిట్ కు రూ.2.09 పైసలు చొప్పున డిపార్టుమెంటు వారు తిరిగి చెల్లించెదరని అన్నారు.ఈ విధముగా మన యొక్క విద్యుత్ బిల్లు తగ్గించు కోవడమే కాకుండా అదనముగా ఉత్పతి చేసిన విద్యుత్ ను అమ్ము కోనవచ్చునని తెలిపారు.ఈ పథకంలో ఇప్పటివరకు 20,507 గృహ విద్యుత్ వినియోగదారులు నమోదు చేసుకున్నారని వారిలో 2108 గృహ విద్యుత్ వినియోగ దారులు 7.00 %వీఔ% కెపాసిటీ గల సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు.మొట్టమొదటిగా ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ వారి ఆద్వర్యములో ద్వారకా తిరుమల గ్రామము నందు పైలట్ ప్రాజెక్ట్ క్రింద 750 %ఖఙజూ% సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నాయని తెలిపారు.జిల్లాకు సంబందించి 5 మోడల్ సోలార్ విలేజ్ తీర్చి దిద్దుటకు గాను ద్వారకా తిరుమల,దుగ్గిరాల,చిననింద్రకొలను,తడికలపూడి, యర్రంపేట ఎంపిక చేయుట జరిగినది అని అన్నారు. ప్రధాన మంత్రి కుసుమ పథకంలో భాగముగా జిల్లాలో ప్రయోగాత్మకముగా రెండు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబందించిన వినియోగదారులను పెదవేగి మరియు టి.నరసాపురం మండలముల యందు ఎంపిక చేసి వారికి సోలార్ పానెల్స్ ను ఏర్పాటు చేసి ఉచిత విద్యుత్ ను అందించటం జరిగినది అని తెలిపారు.ప్రధాన మంత్రి కుసుమ పథకంలో భాగముగా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉదయం పూట ఉచిత నాణ్యమైన 9 గంటల విద్యుత్ ను అందించటానికి గాను జిల్లాలో వ్యవసాయ విద్యుత్ ఫీడర్లు సోలరైజేషన్ చేసే దిశగా ప్రయత్నాలు జరుగు చున్నాయని అన్నారు. ఇందులో భాగముగా సుమారు 115.46 ఏకరాలు పరిశీలించటం జరిగిందని అన్నారు. సౌరశక్తిని వినియోగించడం వలన పర్యావరణ ప్రభావితం చేసే కార్బన్ ఉద్గారాలను తగ్గించడమే కాకుండా పర్యావరణమునకు ఎంతో మేలు చేసినవారము అవుతామని తద్వారా ఆరోగ్యకరమైన జీవితముతో పాటు స్థిరమైన భవిష్యత్తుకు దోహదం చేసినవారు అవుతామని తెలిపారు.ఈ పథకం రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని,ఈ పథకాన్ని మరింత ముందు తీసుకోవాల్సిన బాధ్యత ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తమ వంతు బాధ్యతను నిర్వహించాలని విద్యుత్తు శాఖ సూపర్డెంటు ఇంజనీరు పి.సల్మాన్ రాజు కోరారు.పాత్రికేయుల సమావేశంలో ఇఇ ఏ.రాధాకృష్ణ, డిఇ,నోడల్ అధికారి ఏ.రమాదేవి, సహాయక ఇంజనీరు ఏ.సంజయ్ కుమార్, సోలారు వెండర్లు సి.హెచ్.సతీష్ కుమార్,టెల్ టవర్ కిషోర్, యంవియస్ సోలార్ సురేష్, గ్రేస్ సోలార్ ఆనంద్, విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్థ గైడ్లైన్స్ ద్వారా బదిలీలు చేపట్టాలి:



పాడేరు,జూన్23,(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రం అందజేయాలని కార్యక్రమంలో భాగంగా ఈరోజు అల్లూరి జిల్లాలో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ కి మరియు ఆర్డీవో కి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్స్ గ్రేట్ బి2జెఎల్ఎం లకు విద్యుత్ సంస్థ గైడ్లైన్స్ ద్వారా బదిలీలు చేపట్టాలని రేషనలైజేషన్ పద్ధతి వీరికి వర్తింపచేయాలని వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ కార్యదర్శి కామ్రేడ్ ఆర్ సత్యారావు మరియు సిఐటియు నాయకులు సుందర్ గ్రేట్ టు జెఎల్ఎమ్స్ పాల్గొన్నారు..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# చిట్టూరి ప్రభాకర్ చౌదరి విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తా

## -సిటీ ఎంఎల్ఏ ఆదిరెడ్డి వాసు



**రాజమంట్రి సిటీ, జూన్ 23 (తెలుగు రాష్ట్రం విలేకరి):** సీనియర్ కార్మిక నేత, మాజీ ఎంఎల్ఏ చిట్టూరి ప్రభాకర్ చౌదరి విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని రాజమంట్రి నగర ఎంఎల్ ఏ ఆదిరెడ్డి వాసు తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక ఎంఎల్ ఏ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్ల సంఘం అధ్యక్షులు కుండ్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ తదితర బృందం ఎంఎల్ఏ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నగర అభివృద్ధిలో చిట్టూరి పాత్ర చాలా కీలకమైనది అన్నారు . రోడ్ కామ్ రైల్వే బ్రిడ్జ్ నిర్మాణం కోసం కృషి చేశారని అన్నారు జట్ల సంఘాన్ని ఏర్పాటు చేసిన కార్మిక ఉద్యమకారుడు అని అన్నారు. కార్మిక ప్రజా సమస్యలపై పలు ఉద్యమాలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. తడితోట, వీఎల్ పురం, రోడ్ కామ్ బ్రిడ్జి లాంటి ప్రదేశాలలో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మధు ఎంఎల్ ఏను కోరారు.

# ఏలూరులో 'యువత పోరు'





**పోలవరం, జూన్ 23 (తెలుగు రాష్ట్రం విలేకరి):** నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్మెంట్ సమస్యలపై ఏలూరులో నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమంలో పోలవరం మండలం నుంచి వైసీపీ మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు సోమవారం భారీగా పాల్గొని నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వం స్పందించి యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుష్కరఘాట్‌ను శుభ్రం చేసిన గోదావరి పరిరక్షణ సమితి

## -అధ్యక్షుడు టీకే నేతృత్వంలో చెత్త, వ్యర్థాలు తొలగింపు



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 23 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** రాజమహేంద్రవరం గోదావరి పుష్కర ఘాట్‌లో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయని, భక్తులు పుణ్యస్నానం చేయాలంటే అన్ని రకాల రోగాలు తెచ్చుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆందోళన వ్యక్తం చేసారు. 2027 జూల్కై 23 నుంచి గోదావరి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో పుష్కరాల రేవులో భారీ ఎత్తున నాచు, ప్లాస్టిక్, చెత్తా చెదారం పేరుకుని పోతుంటే అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పుష్కరాల రేవు వద్ద పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేకంగా పడవలు ఏర్పాటు చేసుకుని నదిలో పేరుకుని పోయిన నాచు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ 95 కోట్ల రూపాయలతో హుకుంపేట వద్ద 65 ఎంఎల్‌డి నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం జరుగుతోందని, ఇప్పటివరకు 50 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయన్నారు. నగరంలోని ఆసుపత్రులు, హొటల్స్, పరిశ్రమలు ఇతర సంస్థల నుంచి వస్తున్న వ్యర్థాలన్ని గోదావరిలోనే కలిపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం 55 ఎంఎల్‌డి వ్యర్థాలను శుద్ధి చేయకుండానే మళ్లీ గోదావరిలోనే కలిపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గోదావరి నది పూర్తిగా కలుషితం అవుతోందని, కార్పొరేషన్ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని ప్రజలందరూ తప్పనిసరిగా కాచి వడకట్టుకుని తాగాలని సూచించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు 100 కోట్ల రూపాయల నిధులు అఖండ గోదావరి ప్రాజెక్టుకు వచ్చేస్తున్నాయని చెబుతున్నారని, ముందుగా ప్రజలు పుష్కరఘాట్‌లో పుణ్య స్నానం చేసేందుకు పరిశుభ్రమైన నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఒకసారి గోదావరి నదిలో పరిస్థితిలో పరిశీలన చేయాలని, పురుగులు, చెత్త చెదారం కూడా చాలా ప్రమాదకరంగా వ్యాపిస్తున్నాయన్నారు. గోదావరి పుష్కరాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నీటిలోనే స్థానం చేస్తారా అని ప్రశ్నించారు. మున్సిపల్ కమీషనర్, హెల్త్ ఆఫీసర్, ఎస్ఇ ఇతర అధికారులు రేవులను అసలు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఇలాగే వ్యవహరిస్తే గోదావరి పుష్కరాలు అట్టర్ ఫ్లాఫ్ కావడం ఖాయమని ఎద్దేవా చేసారు. కార్యక్రమంలో సమితి సభ్యులు సిహెచ్ఎస్ వీరభద్రరావు, ఎస్‌వివి రెడ్డి, ఎన్.అప్పారావు, ఎంఆర్‌ల్ శర్మ, పి.రాంబాబు, కెఎస్ పట్నాయక్, ఆజాద్ రాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంచినీటి సౌకర్యం



**టీ. నర్సాపురం, జూన్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** బొర్రంపాలెం గ్రామ పంచాయతీ యం ఆర్ సీ కాలనీలో సుమారు 15 కుటుంబాలు వారు కొత్తగా ఇళ్లను నిర్మించుకుని గత మూడు సంవత్సరాలుగా అక్కడే పిల్లాపాపలతో జీవిస్తున్నారు. వారు త్రాగు నీరు,విద్యుత్ సౌకర్యం తమకు కల్పించాలని సర్పంచ్, కార్యదర్శి మరియు లోకల్ లీడర్ల వద్దకు ఈ మూడు సంవత్సరాలుగా కాళ్ళు అరిగేలా తిరిగినా ఉపయోగం లేకపోయిందన్నారు. గడిచిన నాలుగు రోజుల క్రితం మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు తనయుడు స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత మరియు పారిశ్రామిక వేత్త పెండ్యాల అభిషేక బాబు ను కలసి సమస్యను తాము తెలుపగా ఆయన వెంటనే సానుకూలంగా స్పందించడమే కాక నిన్న మాకు ఆయన ఆర్థిక సహాయంతో దాహార్తిని తీర్చిన మంచి ప్రజా నాయకుడని కొనియాడారుఈ కార్యక్రమంలో బత్తుల రమేష్ కొనకళ్ళ సర్వేశ్వరరావు పల్లా రమేష్,కంభంపాటి జోగేశ్వరావు రాజబోయిన రమేష గుండె పాండురంగ గుండె చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాన్ని చింతలపూడిలో ఏర్పాటు చేయాలి



**చింతలపూడి, జూన్ 23 (తెలుగురాష్ట్రం విలేఖరి):** జూన్ 25వ తేదీన 6, 7, 8, 9 తరగతులకు నిర్వహించబోయే అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష సెంటర్ ను పెదవేగి సెంటర్ కు, వట్లూరు సెంటర్ కు మార్చడం జరిగిందని , చింతలపూడి ,లింగపాలెం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాలలోని విద్యార్థుల సౌకర్యార్థం చింతలపూడి అంబేద్కర్ గురుకుల పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష ను నిర్వహించాలని ఐటీడీపీ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, నియోజకవర్గ టిడిపి నాయకులు డా.మారుమూడి థామస్ సోమవారం స్పందనలో ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులైన డిసిఓ తో మాట్లాడి చింతలపూడి అంబేద్కర్ గురుకుల పాఠశాలలోనే పరీక్షను నిర్వహించేలా సమీక్ష నిర్వహించి అవసరమైతే స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అనీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో దేశవరం గ్రామ టిడిపి నాయకులు కందికొండ రాజు, టిడిపి ఎస్సీ సెల్ చింతలపూడిటౌన్ కార్యదర్శి బోడ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలను అభివృద్ధి చేయాలి



**జగ్గయ్యపేట, జూన్ 23 (తెలుగురాష్ట్రం విలేకరి):** జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ దేవాలయాలలో అభివృద్ధి పనులు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ టెంపుల్ టూరిజం మరియు కేంద్ర ప్రభుత్వ ప్రసాదం స్కీముల ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం పెనుగంచిప్రోలు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం తిరుమలగిరి, శ్రీ కోటిలింగ హరిహర మహా క్షేత్రం ముక్త్యేశ్వరపురం, శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వేదాద్రి, ఈ నాలుగు దేవాలయాలను అభివృద్ధి చేయవలసిందిగా దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని విజయవాడలో ఎంపీ కేశినేని శివనాద్ చిన్నితో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మంత్రికి లేఖను అందజేశారు.

# నేటి నుంచి శ్రీ రాచపోలమాంబ అమ్మవారి పండుగ మహోత్సవాలు

## -జులై 15 న ప్రధాన పండుగ



**విశాఖపట్నం, జూన్ 23 (తెలుగురాష్ట్రం విలేకరి):** విశాఖ జిల్లా, అల్లిపురం గ్రామదేవతగా ప్రసిద్ధిగాంచిన గొడుగులమ్మ ( శ్రీరాచపోలమాంబ ) అమ్మవారి పండుగ మహోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు సతకంపట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నెలరోజుల పాటు జరిగే ఈ పండుగలో మొదటి మంగళవారం తేది 24న భూలోకమ్మ అమ్మవారి ఉత్సవం, రెండో మంగళవారం తేది జులై 1న పరదేశమ్మ అమ్మవారి ఉత్సవం, జులై 6 అర్ధరాత్రి నుంచి గ్రామంలో ఉజ్జిడి బండి తిరుగుతుందని పేర్కొన్నారు. జులై 7న అమ్మవారికి పుట్ట బంగారం తీసుకురావడం, జూలై 8న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఘటాల సంబరం ప్రారంభమవుతుందని తెలిపారు. జూలై 12 సాయంత్రం ఐదు గంటల నుంచి సత్తమ్మ అమ్మవారి ఉత్సవం, జూలై 13 న మరిడమ్మ అమ్మవారి ఉత్సవం, జూలై 14 న అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి సతకంపట్టు ఆలయం వద్ద ఉంచుతామని చెప్పారు. ఆరోజు అర్ధరాత్రి అల్లిపురం గాంధీబొమ్మ వద్ద నున్న శ్రీరాచపోలమాంబ అమ్మవారి సతకం పట్టు ఆలయం వద్ద తొలెళ్లు సంబరాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. జూలై 15న అమ్మవారి ప్రధాన పండుగను జరుపడానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు నిర్ణయించారని వివరించారు. ఈ పండుగ మహోత్సవాల్లో భాగంగా జూలై 22న మంగళవారం మారువారం పండుగ నిర్వహించి, లక్కీ డ్రా ద్వారా విలువైన బహుమతులు అందజేస్తామని చెప్పారు. జూలై 24న నీలమ్మతల్లి పండుగ, జూలై 27 ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పండుగ మహోత్సవాలకు సంబంధించి పురవీధుల్లో చాటింపు కూడా వేయిస్తున్నామని, అదే విధంగా గ్రామ ప్రజలకు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేయడం, ప్రజా ప్రతినిధులకు ఆహ్వాన పత్రాలను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అమ్మవారి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సతకంపట్టు ఆలయ పరిసర రహదారులను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. ప్రతిరోజూ ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, గ్రామ ప్రజలంతా పండుగ మహోత్సవాల నిర్వహణకు సహకరించాలని ప్రతినిధులు కోరారు.

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి

## -బీజేపీ నాయకురాలు మాధవి



**విజయవాడ, జూన్ 23 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన బీజేపీ నాయకురాలు కంభంపాటి మాధవి బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారాన్ని త్యజించడం ద్వారా దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన సర్వస్వం త్యాగం చేశారని దేశం కోసం ఆయన చేసిన త్యాగం ఎల్లప్పుడు మరువలేనిదని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

# రాజమండ్రిలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జర్మన్ భాష శిక్షణ ప్రారంభ సభ



**రాజమహేంద్రవరం, జూన్ 23, (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఇతర భాషల్లో నైపుణ్యం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు స్కిల్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జర్మన్ భాష శిక్షణ కార్యక్రమం ప్రారంభ సభ సోమవారం మధ్యాహ్నం జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్ నిర్వహించారు.జర్మనీ భాధ నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి జిల్లాలోని 50 మంది ఎంపికైన నర్సులు హాజరయ్యారు. వీరిని అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు ఉద్యోగాలకు సిద్ధం చేయడం ఈ శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అనీ వ్యవస్థాపక చైర్మన్, జీఎస్ఎల్ డా. గన్ని భాస్కరరావు పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా జర్మన్ భాషలో నైపుణ్యం కలిగి, విదేశీ ఉద్యోగ అవకాశాలను పొందేందుకు నర్సులకు మార్గం సుగమనం అయిందన్నారు. ఇటువంటి శిక్షణా తరగతులు నిర్వహించడం, భాషా అభ్యాసాన్ని ఉపయోగించుకుని ప్రతిభను చాటుకోవాలని సూచించార మరియు స్కిల్‌బీ సంస్థల ప్రతిష్టాత్మక కృషిని వక్తలు ఈ సందర్భంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులు ప్రిన్సిపాల్, జీఎస్ఎల్ నర్సింగ్ కాలేజీ డా. గీతా ప్రవీణా , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మనోహర్, ప్రాంతీయ ఉపాధి అధికారి టి. అనిల్ , జిల్లా ఉపాధి అధికారి జి..హరిశ్చంద్ర ప్రసాద్ , ప్రోగ్రాం ఇంచార్జి మేనేజర్, బి. సాయి కృష్ణ , జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి – వి.డి.జి.మురళి, వైద్యాధికారి రాజానగరం, ఆరోగ్య శాఖ , డా. రామ్ భాస్కర్ , వ్యవస్థాపకుడు, స్కిల్‌బీ ఉజ్వల్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి లక్ష్యాలను అందుకునేలా విద్యా బోధన ఉండాలి!





**భీమవరం జూన్ 23: (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అనుకున్న లక్ష్యాలను అందుకునే విధంగా తయారు చేసే విధంగా విద్యారంగంలో విద్యాబోధనలో వినూత్న మార్పులు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని తమిళనాడులోని మధురై త్యాగరాజర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్ భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్ ఇన్ ది రివైజ్ ఎన్ బీ ఏ టైర్ వన్ ఫ్రేమ్ వర్క్ పేరిట రెండు రోజులు పాటు నిర్వహించే వర్క్ షాప్ ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ రాజేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఈ విద్యా విధానంలో టీచింగ్ లెర్నింగ్ లో లక్ష్యాలు సాధించే దిశగా మార్పులు జరగాలని స్పష్టంగా పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా విద్యా బోధన ఉంటే విద్యార్థి మరిన్ని ఫలితాలు లక్ష్యాలు సాధించగలరని ఆయన నొక్కి చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళి కృష్ణంరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు కూడా నూతన అంశాల అధ్యయనం చేసేందుకు ఇటువంటి వర్క్ షాప్ దోహదపడతాయని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే వర్క్ షాప్ లో కళాశాల అన్ని విభాగాలకు చెందిన అధ్యాపక బృందం పాల్గొంటున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
జూన్ 24,
మంగళవారం 2025


## టీమ్ఇండియా కోచ్ పదవి

# చేపట్టడానికి మాత్రం తాను సిద్ధం

**కోల్‌కతా: తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ మరోసారి స్పష్టం చేశాడు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్ ఎన్నికల నేపథ్యంలో ఏదైనా పార్టీ ముఖ్యమంత్రి పదవిని ఇచ్చే ప్రయత్నం చేస్తే ఏం చేస్తారు అన్నా కూడా ఆయన రాజకీయాలపై తనకు ఆసక్తి లేదనే సమాధానం ఇచ్చారు. టీమ్ఇండియా కోచ్ పదవి చేపట్టడానికి మాత్రం తాను సిద్ధమని గంగూలీ పేర్కొనడం విశేషం.**




"వేర్వేరు భిన్నమైన పాత్రల్లో ఉండటంతో రాజకీయాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. 2013లో క్రికెట్‌కు వీడ్కోలు పలికి బీసీసీఐ అధ్యక్షుడినయ్యా. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దాం. నాకు 52 ఏళ్లు. భారత జట్టు కోచ్ పదవికి నేను సిద్ధమే. ఎక్కడి వరకు వెళ్తుందో చూద్దాం" అని గంగూలీ పేర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు ఫిట్‌గా ఉండటం.. భారత జట్టులో చోటు సంపాదించడం విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మలకు అంత సులువు కాదని దిగ్గజ క్రికెటర్ సౌరభ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. వన్డే ప్రపంచకప్‌లోపు భారత్ 9 ద్వైపాక్షిక సిరీస్‌లలో 27 మ్యాచ్‌లు ఆడనుంది. ఈ లెక్కన కోహ్లి, రోహిత్ ఏడాదికి 15 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అవకాశముంది. "ప్రతి ఒక్క ఆటగాడి మాదిరిగానే వారి నుంచి ఆట దూరమవుతుంది.. ఆటకు వాళ్లు దూరమవుతారని మనందరం అర్థంచేసుకోవాలి. ఏడాదికి 15 మ్యాచ్‌లు ఆడుతూ ఫిట్‌గా ఉండటం.. భారత జట్టులో చోటు సంపాదించడం కోహ్లి, రోహిత్‌లకు సులువు కాదు. వారికి నేనిచ్చే సలహా ఏమీ లేదు. నాకు తెలిసినంత క్రికెట్ వారికి కూడా తెలుసు. వాళ్లే నిర్ణయం తీసుకుంటారు. కోహ్లి అద్భుతమైన ఆటగాడు. అతనికి ప్రత్యమ్నాయ ఆటగాడు రావడానికి సమయం పడుతుంది. అదేమీ ఆందోళన కలిగించే విషయం కాదు" అని దాదా చెప్పాడు.

లక్ష్మణ్ 3 నెలలు మాట్లాడలేదు: 2003 వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపిక చేయకపోవడంతో వీవీఎస్ లక్ష్మణ్ తనతో మూడు నెలలు మాట్లాడలేదని గంగూలీ తెలిపాడు. చక్కటి ఫామ్‌లో ఉన్న లక్ష్మణ్‌ను కాదని సెలక్టర్లు దినేశ్ మోంగియాను ప్రపంచకప్ జట్టులోకి ఎంపిక చేసిన సమయంలో గంగూలీ భారత కెప్టెన్‌గా ఉన్నాడు. "సహజంగానే లక్ష్మణ్ నిరాశకు గురయ్యాడు. ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చినప్పుడు చాలాసార్లు ఇలాగే జరిగింది. ప్రపంచకప్‌లో అవకాశం దక్కనపుడు లక్ష్మణ్ నాతో మూడు నెలలు మాట్లాడలేదు. ఆ తర్వాత అతనితో రాజీ చేసుకున్నా. ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీకి దూరమైనప్పుడు నైరాశ్యం సహజమే. లక్ష్మణ్ లాంటి నైపుణ్యమున్న ఆటగాడు నిరాశ చెందడంలో అర్థం ఉంది. కానీ టోర్నీ ముగిశాక ప్రపంచకప్‌లో జట్టు ప్రదర్శన పట్ల లక్ష్మణ్ సంతోషం వ్యక్తంచేశాడు" అని గంగూలీ పేర్కొన్నాడు. 2003 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా రన్నరప్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. లక్ష్మణ్ బదులు ఎంపికైన దినేశ్ మోంగియా టోర్నీలో పేలవ ప్రదర్శన చేశాడు.

# బుమ్రా.. కోహినూర్‌లా విలువైన వాడు

**దినేశ్ కార్తిక్**

**లీడ్స్: టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ .. జస్ప్రీత్ బుమ్రాపై ప్రశంసల వర్షం కురిపించాడు. లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్ట్‌మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా అయిదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఈనేపథ్యంలో బుమ్రా.. కోహినూర్‌లా విలువైనవాడని కొనియాడాడు. ఫార్మాట్లకు అతీతంగా బుమ్రా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు, బౌలింగ్‌లో నిలకడ గురించి ప్రస్తావించాడు. అలాగే టెస్ట్ క్రికెట్‌లో 200 కంటే ఎక్కువ వికెట్లు తీసుకున్న బౌలర్లందరి కంటే బుమ్రా యావరేజ్ బాగుంటుందని ప్రశంసించాడు.**




'బుమ్రా కోహినూర్‌లా విలువైనవాడు. అన్ని ఫార్మాట్లలో అతడి ప్రాముఖ్యం ఏంటో జనాలు ఇప్పటికే గుర్తించి ఉంటారు. ఏ ఫార్మాట్ అయినా... ఏ బంతి అయినా అతడు తన సత్తా చాటుతాడు. అన్నింటి కంటే ముఖ్యంగా బుమ్రా ముందుగానే బ్యాటర్ మనసును చదివేస్తాడు. తర్వాత ఏ షాట్ ఆడబోతున్నాడో.. ఊహించి దానికి అనుగుణంగా తన బంతులను సంధిస్తాడు. టెస్ట్ క్రికెట్‌లో 200కు పైగా వికెట్లు తీసుకున్న బౌలర్లలందరి కన్నా జస్ప్రీత్ బుమ్రాకే మంచి యావరేజ్ ఉంది. అతడు ఎంత ప్రత్యేకమో ఇదే మనకు చెబుతుంది' అని దినేశ్ కార్తిక్ ఓ క్రీడా ఛానల్‌తో అన్నాడు.

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌట్ అయింది. బుమ్రా 82 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో అతడికిది 14వ, విదేశాల్లో 12వ అయిదో వికెట్ ప్రదర్శన. ఇతర సీమర్ల నుంచి మద్దతు లేని దశలో, అలాగే ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేసిన తరుణంలోనూ బుమ్రా ఈ మ్యాచ్‌లో అయిదు వికెట్ల ప్రదర్శన చేయడం నిజంగా అద్భుతం. లీడ్‌లోకి వెళ్లకుండా ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేయడంలోనూ బుమ్రా కీలకపాత్ర పోషించాడు. బౌలింగ్‌లో అతడి టెస్ట్ సగటు 19.3. ఈ ఫార్మాట్ చరిత్రలో 200 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన 86 మంది బౌలర్లలో ఇదే అత్యుత్తమం.

## శార్దూల్ ఠాకూర్‌తో మరిన్ని ఓవర్లు

# బౌలింగ్ చేయించాల్సింది: దినేశ్ కార్తిక్

**లీడ్స్: లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో (తొలి ఇన్నింగ్స్) శార్దూల్ ఠాకూర్ కేవలం ఆరు ఓవర్లు మాత్రమే బౌలింగ్ వేశాడు. జట్టులోకి తీసుకున్నప్పుడు అతడికి మరిన్ని ఓవర్లు బౌలింగ్ వేసే అవకాశం ఇవ్వాల్సిందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌కు టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ సూచించాడు.**




ఇప్పటి వరకు ఈ మ్యాచ్‌లో శార్దూల్ అటు బ్యాట్‌తో కానీ, ఇటు బాల్‌తో కానీ రాణించలేకపోయాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో అతడు 8 బంతులు ఎదుర్కొని కేవలం 1 పరుగు మాత్రమే చేశాడు. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు బౌలింగ్ వేసి 38 పరుగులు ఇచ్చాడు. శార్దూల్ బౌలింగ్ మీద నమ్మకం లేనప్పుడు అతణ్ని జట్టులోకి తీసుకోవడం అర్ధరహితమని ఈ సందర్భంగా దినేశ్ కార్తిక్ కుండబద్దలు కొట్టినట్లు తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

'శార్దూల్ ఠాకూర్ విషయంలో టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ ఒకసారి పునరాలోచించుకోవాలి. ఒకవేళ అతడి బౌలింగ్‌పై నమ్మకం లేకుంటే.. అతణ్ని ఎందుకు టీమ్‌లో ఆడిస్తున్నారు? నలుగురు ఫాస్ట్ బౌలర్లను జట్టులో ఆడిస్తున్నప్పుడు అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలి' అని దినేశ్ కార్తిక్ అన్నాడు. 'శార్దూల్ అద్భుతంగా బౌలింగ్ చేయలేదు నిజమే! అయినా కేవలం ఆరు ఓవర్లు మాత్రమే అతడికి బౌలింగ్ చేసే అవకాశం ఇవ్వడం మాత్రం సరైన నిర్ణయం కాదు. శార్దూల్‌పై ఈ విషయంలో నాకు బాధగా ఉంది. కానీ శుభ్‌మన్ గిల్ ఏం ఆలోచించాడో నేను ఊహించగలను. ఇతర బౌలర్లతో బౌలింగ్ చేయించి ఇంగ్లాండ్ టీమ్‌పై మరింత ఒత్తిడి పెట్టాలనుకున్నాడు' అని దినేశ్ కార్తిక్ పేర్కొన్నాడు.

# ఐసీసీ నుంచి ఆంక్షలు

## ఎదుర్కొనే ప్రమాదంలో రిషభ్ పంత్!



**లీడ్స్ : లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మూడో రోజు టీమ్ఇండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఆన్- ఫీల్డ్ అంపైర్ పాల్ రీఫెల్‌తో ఘాటుగా మాట్లాడాడు. తర్వాత బంతిని మైదానంలోకి విసిరి ముందుకు నడిచాడు. ఈ చర్యతో పంత్.. ఐసీసీ నుంచి ఆంక్షలు ఎదుర్కొనే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ 61వ ఓవర్‌లో.. మహమ్మద్ సిరాజ్ వేసిన బంతిని హ్యారీ బ్రూక్ బౌండరీ బాదాడు. తర్వాత బంతి పరిస్థితిపై రిషభ్ పంత్ అసంతృప్తి చెందాడు. దీంతో బాల్‌ను పరిశీలించమని అంపైర్ పాల్ రీఫెల్ వద్దకు తీసుకువెళ్లాడు. అంపైర్ దానిని బాల్ గేజ్ ద్వారా పరీక్షించి అంతా బాగుందని చెప్పాడు. దీంతో వికెట్ కీపర్ పంత్ అసంతృప్తి వ్యక్తంచేశాడు. బంతిని మైదానంలోకి విసిరి వెళ్లిపోయాడు, పంత్ ఇలా చేయడం అనవసరం అని వ్యాఖ్యాత మార్క్ బౌచర్ అన్నాడు.**

ఈ చర్యతో పంత్ రెండు ప్రవర్తనా నియామవళి ఉల్లంఘనలకు పాల్పడినట్లుగా ఐసీసీ తేల్చే అవకాశం ఉంది. ఆన్‌ఫీల్డ్‌లో అంపైర్ నిర్ణయంపై భిన్నాభిప్రాయం వ్యక్తంచేయడం, అలాగే మ్యాచ్ సమయంలో ఆటగాడు, సహాయక సిబ్బంది, అంపైర్, మ్యాచ్ రిఫరీ మీద బంతి, నీళ్ల సీసా, ఏదైనా వస్తువును విసిరివేయడాన్ని నేరంగా పరిగణించే ఛాన్స్ ఉందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఈ మ్యాచ్‌లో ప్రసిద్ధ్ కృష్ణ (%ళాతీఖుంఱుఅష్త ఖతీఅంష్త్రఋఖ%) బౌలింగ్‌లో ఓలి పోప్ బ్యాట్‌ను తాకి తన చేతుల్లోకి వచ్చిన బంతిని ఒడిసిపట్టుకున్న రిషభ్ పంత్.. తన కెరీర్‌లో 150వ క్యాచ్‌ను పూర్తి చేసుకున్నాడు. దీంతో ఈ ఫీట్ సాధించిన మూడో భారత వికెట్ కీపర్‌గా నిలిచాడు. పంత్ కంటే ముందు సయ్యద్ కిర్మాణీ (160), మహేంద్ర సింగ్ ధోనీ (%మీా ఇష్త్రశీఅఱ%) (256) ఉన్నారు. ప్రస్తుతం రిషభ్ పంత్ 151 క్యాచ్‌లు, 15 స్టంపింగ్స్ (166 డిస్మిసల్స్) చేశాడు. ఈ విషయంలో టాప్ పొజిషన్‌లో ఉన్న ధోనీ 256 క్యాచ్‌లు 38 స్టంపింగ్‌లు (మొత్తం 294 డిస్మిసల్స్) చేశాడు.

# వాషింగ్టన్ ఫ్రీడమ్‌దే విజయం!



**డల్లాస్ : మేజర్ లీగ్ క్రికెట్ 2025లో భాగంగా డల్లాస్‌లోని గ్రాండ్ ప్రైరీ స్టేడియం వేదికగా వాషింగ్టన్ ఫ్రీడమ్, టెక్సాస్ సూపర్ కింగ్స్ తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన టెక్సాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 220 పరుగులు చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ 31 బంతుల్లో 69 పరుగులతో రాణించాడు. మార్కస్ స్టొయినిస్ 32, మిలింద్‌కుమార్ 31తో ఫర్వాలేదనిపించారు. వాషింగ్టన్ ఫ్రీడమ్ బౌలింగ్‌లో మిచెల్ ఓవెన్ 3, మాక్స్‌వెల్ 2, రచిన్ రవీంద్ర 1 వికెట్ తీసుకున్నారు.**

తర్వాత 221 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు 19.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 223 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో మిచెల్ ఓవెన్ 89, ఆండ్రిస్ గౌస్ 80లి రాణించారు. దీంతో వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టు, టెక్సాస్ సూపర్ కింగ్స్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో సీటెల్ ఓర్కాస్, లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన సీటెల్ ఓర్కాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 177/6 స్కోరు సాధించింది. బ్యాటింగ్‌లో అరోన్ జోన్స్ (44), డేవిడ్ వార్నర్ (38) రాణించారు. లాస్ ఏంజెలెస్ బౌలర్లలో రస్సెల్ 3, కార్నే డ్రై, షాడ్లీ వాన్ షాల్క్‌విక్, జాసన్ హోల్డర్ తలో వికెట్ తీసుకున్నారు. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన లాస్ ఏంజెలెస్ నైట్‌రైడర్స్ జట్టు 18.2 ఓవర్లలోనే 4 వికెట్లు నష్టపోయి 178 రన్స్ చేసింది. సీటెల్ ఓర్కాస్ జట్టుపై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌లో ఓపెనర్ ఉన్ముక్త్ చంద్ 86లి, సైఫ్ బదర్ 54 రాణించారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక




# అలాంటి సినిమాలకు రష్మిక లక్కీ ఛార్మ్

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన కుబేర సినిమా హిట్ అవడంతో రష్మిక మళ్లీ సక్సెస్ ట్రాక్ లోకి వచ్చింది. గత శుక్రవారం రిలీజైన ఈ సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. రష్మిక నుంచి వచ్చిన ఆఖరిగా వచ్చిన సినిమా సికందర్. సల్మాన్ ఖాన్ సరసన రష్మిక నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలవగా, ఇప్పుడు మళ్లీ కుబేర సినిమాతో రష్మిక మంచి హిట్ ను అందుకుంది.యానిమల్, పుష్ప2, ఛావా సినిమాల సక్సెస్ తర్వాత కుబేర సినిమాకు రష్మిక అద్భుతమైన రెస్పాన్స్ ను అందుకుని, తన విజయాల పరంపరను కొనసాగిస్తోంది. కుబేర సినిమాలో ధనుష్, నాగార్జున పాత్రలకు వచ్చినంత రెస్పాన్స్ రష్మిక పాత్రకు రాకపోయినా, సమీరాగా రష్మిక ఎంతో ఒద్దికగా, చాలా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చి అందరి మన్ననలను పొందుతుంది. కుబేర సినిమాలో డంప్ యార్డ్ సీన్ లో మాత్రం రష్మిక నటన అందరినీ ఆకట్టుకుంది.కుబేర సినిమా సక్సెస్ తర్వాత రష్మికను పాన్ ఇండియన్ సినిమాలకు లక్కీ చార్మ్ గా తన ఇమేజ్ ను నిలబెట్టుకుందని నెటిజన్లు చెప్తున్నారు. రష్మిక మందన్నా గత రెండు కోలీవుడ్ సినిమాలు సుల్తాన్, వరిసు ఓ మోస్తరు వసూళ్లనే రాబట్టుకున్నాయి. కుబేర కూడా తమిళంలో యావరేజ్ బిజినెస్ ను మాత్రమే చేస్తోంది. అయితే ఈ సినిమా సక్సెస్ రష్మికకు కోలీవుడ్ లో కొత్త మార్కెట్ ను తెచ్చిపెట్టే అవకాశాలున్నాయి.ప్రస్తుతం రష్మిక మందన్నా నాలుగు ప్రాజెక్టుల్లో హీరోయిన్ గా నటిస్తుండగా అందులో ది గర్ల్‌ఫ్రెండ్, రెయిన్‌బో అనే తెలుగు సినిమాలతో పాటూ థామా, కాక్‌టెయిల్2 అనే రెండు బాలీవుడ్ సినిమాలు కూడా ఉన్నాయి. సినిమా రిజల్ట్ తో సంబంధం లేకుండా సినిమా సినిమాకీ తన క్రేజ్ ను విపరీతంగా పెంచుకుంటూ పోతున్న రష్మిక ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో ఎలాంటి ఫలితాలను అందుకుంటుందో చూడాలి.

# పుష్పలా అయిపోతా.. అల్లుళ్లతో బాలయ్య క్రేజీ ఫన్!



టాలీవుడ్ నటసింహం, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ.. ఇప్పుడు బెస్ట్ స్టేజ్ లో ఉన్నారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఓవైపు వరుస సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటున్నారు. తన టాలెంట్ తో మెప్పిస్తున్నారు. మరోవైపు రాజకీయాల్లో కూడా బిజీగా గడుపుతున్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వరిస్తున్నారు.అదే సమయంలో కుటుంబంతో కూడా క్వాలిటీ టైమ్ స్పెండ్ చేస్తుంటారు. ఫ్యామిలీ ఫంక్షన్లలో సందడి చేస్తుంటారు. తన సతీమణి, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లతో కనిపిస్తుంటారు. రీసెంట్ గా హైదరాబాద్ లో మాజీ ఎంపీ, బంధువు కావూరి సాంబశివరావు షష్టిపూర్తి వేడుకకు బాలయ్య వెళ్లారు. అల్లుళ్లు నారా లోకేష్, శ్రీభరత్ తో కలిసి పాల్గొన్నారు.అప్పుడు తన ఇద్దరు అల్లుళ్లతో కలిసి ఫోటో దిగేందుకు వేదికపైకి బాలయ్య వెళ్లారు. లోకేష్, భరత్ పై భుజాలపై చేతులు వేసి ఫోటో దిగాలని చూశారు. అప్పుడు చిన్నల్లుడు భరత్ ను సరదాగా వ్యాఖ్యానించారు. నీ మీద చేయి వేయాలంటే ప్రాబ్లం.. పుష్ప లా అయిపోతా.. అందుకే ఇక్కడ వేశా అని సడెన్ గా బాలయ్య అనడంతో నవ్వేశారు.ఆ తర్వాత బాలయ్య ఇక్కడైతే హ్యాపీ అంటూ లోకేష్ భుజం మీద చేతులు వేశారు. అనంతరం ఇద్దరు అల్లుళ్ళ భుజాలపై చేతులు వేసి పిక్ తీసుకున్నారు. మొత్తానికి ఆ ఇన్సిడెంట్ కు సంబంధించిన వీడియో.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలయ్య టైమింగ్ సూపర్ అని కామెంట్లు పెడుతున్నారు. ఫన్నీ డైలాగ్ సూపర్ అని చెబుతున్నారు.కాగా.. బాలయ్య ఇద్దరు అల్లుళ్లు కూడా రాజకీయాల్లో ఉన్న విషయం తెలిసిందే. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుమారుడు, బాలయ్య పెద్ద అల్లుడు నారా లోకేష్ ఇప్పుడు విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్విస్తున్నారు. మరోవైపు, చిన్న అల్లుడు శ్రీ భరత్.. ఇప్పుడు విశాఖపట్నం ఎంపీగా గెలిచి పార్లమెంట్ కు వెళ్లారు.అలా మొత్తానికి మామా అల్లుళ్లు ముగ్గురూ రాజకీయాల్లో బిజీగా ఉంటున్నారు. అధికార కూటమిలోని ప్రధాన పార్టీ టీడీపీలోనే ఉన్నారు. అయితే తమ వర్క్ తో ఎప్పుడూ తలమునకలయ్యే వారు ముగ్గురూ.. ఇప్పుడు సరదాగా కనపడిన వీడియో సోషల్ మీడియాలో ఇప్పుడు తెగ ట్రెండ్ అవుతోంది. మరి మీరు కూడా ఆ వీడియోను చూసేయండి.




# అమీర్ ఖాన్.. ఈసారి హిట్టు కొట్టినట్లేనా?



3 ఇడియట్స్ - పీకే - దంగల్ లాంటి సినిమాలతో బాక్సాఫీస్ వద్ద ఒక ట్రెండ్ సెట్ చేసిన అమీర్ ఖాన్ ఈమధ్య కాలంలో కొన్ని ఊహించని డిజాస్టర్స్ ను ఎదుర్కొన్నాడు. సౌత్ సినిమాల డామినేషన్ తో ఖాన్ త్రయం సందిగ్ధంలో పడగా ఎక్కువ ప్రభావం మిస్టర్ పర్ఫెక్ట్ మీదే పడింది. అయినప్పటికీ సేఫ్ గేమ్ ఆడకుండా ప్రయోగాత్మక కథలపైనే ఫోకస్ పెట్టాడు అమీర్ ఖాన్. ఇప్పుడు ఉన్న బాలీవుడ్ హీరోల్లో తన సినిమాలతో సామాజికమైన అంశాలపై చర్చను తెచ్చే స్టైలే అమీర్ ఖాన్‌ది.లాల్ సింగ్ చద్దా డిజాస్టర్ తర్వాత మళ్లీ రీమేక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడం అనేకమందిని ఆశ్చర్యపరిచింది. 'సితారే జమీన్ పర్' అనే ఎమోషనల్ డ్రామాతో అందరినీ ఆలోచనలో పడేసాడు. హాలీవుడ్ చిత్రం 'చాంపియన్స్' ఆధారంగా రూపొందిన ఈ సినిమా, పిల్లలపై, వారి మానసిక స్థితిపై ఫోకస్ చేస్తూ తనదైన శైలిలో అమీర్ మళ్లీ స్క్రీన్ మీద మెరిశాడు. ఈ సినిమాపై మొదటి రెండు రోజులు పెద్దగా అంచనాలు లేకపోయినా, ఇప్పుడు క్రమంగా వేగం పెంచుతోంది.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, విడుదలైన మూడు రోజుల్లోనే ఈ సినిమా దాదాపు 60 కోట్లు వసూలు చేసింది. ఆదివారం ప్రత్యేకంగా మంచి గ్రోత్ కనిపించింది. మహేష్ బాబు వంటి సౌత్ స్టార్లు ఈ సినిమాపై సోషల్ మీడియాలో సపోర్ట్ తెలపడంతో పాజిటివ్ వేవ్ మరింత పెరిగింది. మంచి కంటెంట్ ఉన్న సినిమా అనే అభిప్రాయం జనం మధ్య విస్తరిస్తోంది.ఈ సినిమాకు పెద్ద రేంజ్ బ్లాక్‌బస్టర్ స్థాయి టాక్ రాకపోయినా, ఓ ఫ్యామిలీ డ్రామాగా నిలవగలదని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. బాలీవుడ్‌లో ఇప్పట్లో పెద్ద రిలీజ్‌లు లేకపోవడంతో హిందీ ఆడియన్స్‌కు ఇది బెస్ట్ ఆప్షన్ గా మారుతోంది. కుబేర హిందీలో పెద్దగా క్లిక్ కాకపోవడంతో అమీర్ సినిమా స్థిరమైన చోటు దక్కించుకుంటోంది. తారే జమీన్ పర్, చక్ దే ఇండియా వంటి భావోద్వేగ చిత్రాల మిక్స్ లా ఉండడంతో ఫ్యామిలీస్ అట్రాక్ట్ అవుతున్నారు.ఇక ఓటీటీ విషయానికి వస్తే, ఇప్పటికే కొన్ని సంస్థలు 100 కోట్లకు పైగా ఆఫర్ చేసినా అమీర్ ఖాన్ మాత్రం యూట్యూబ్ పేపర్ వ్యూ మోడల్‌నే ముందుగానే ప్లాన్ చేశాడని తెలుస్తోంది. థియేటర్లో మంచి వసూళ్లు వస్తే అమీర్ ఆ డిస్ట్రిబ్యూషన్ మోడల్‌నే ఫాలో కావచ్చు. ఒకవేళ ఇంకా కలెక్షన్లు బాగా పెరిగితే, ఓటీటీ డీల్స్‌పై మళ్లీ ఆలోచించవచ్చని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఇక తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక షోలు వేసే ఆలోచనలో అమీర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇది జరిగితే మళ్లీ ఒక కొత్త మార్కెట్‌ను టార్గెట్ చేసినట్టే అవుతుంది.

# సూపర్ స్టార్ తో స్టార్ డైరెక్టర్ రాజకీయమా!



70 ప్లస్ లోనూ సూపర్ స్టార్ రజనీకాంత్ మెరుపు వేగంతో షఉటింగ్ లు పూర్తి చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కూలీ పూర్తి చేసి 'జైలర్ 2'ని పట్టాలెక్కించి పూర్తి చేసే పనిలో ఉన్నారు. కొన్ని నెలలుగా ఆ సినిమా షఉట్ లోనే బిజీగా ఉన్నారు. అయితే ఈ సినిమా సెట్స్ లో ఉండగానే తదుపరి ప్రాజెక్ట్ ను కూడా లైన్ లో పెట్టే పని మొదలు పెట్టారు. 'ఖాకీ' దర్శకుడు హెచ్. వినోథ్ తో సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుం టున్నారు.కానీ అది కుదర్లేదు. ఈ నేపథ్యంలో తదుపరి చిత్రం వినోథ్ తోనే మొదలు పెట్టాలని స్ట్రాంగ్ గా ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే రజనీకాంత్-వినోద్ మధ్య రెండు దశల్లో స్టోరీ డిస్కషన్స్ జరిగాయని తెలిసింది. ఈ నేపథ్యంలో స్టోరీ కూడా లీకవుతుంది. ఇదొక పోలిటికల్ థ్రిల్లర్ చిత్రమని తెలుస్తోంది. సీరియస్ రాజకీయ కోణంలో సాగే చిత్రమని..ఆద్యంతం ఆసక్తికరంగా ఉండే కాన్సెప్ట్ అంటున్నారు.రజనీ కూడా స్టోరీ ఓకే చేసినట్లు వార్తలొస్తున్నాయి. అయితే దీనిపై అధికారికంగా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం విజయ్ ....దళపతి విజయ్ హీరోగా 'జన నాయగన్' అనే సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇది రాజకీయ నేపథ్యంలో తెరకెక్కిస్తోన్న చిత్రమే. విజయ్ వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగడంతో అతడి రాజకీయ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని చేసిన చిత్రంగా చేస్తున్నాడు. ఈసినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.అటుపై రజనీకాంత్ ఒకే అనుకుంటే? వినోద్ ఆ చిత్రాన్ని పట్టాలెక్కించాల్సి ఉంటుంది. వినోద్ కు ఇంత వరకూ డైరెక్టర్ గా వైఫల్యం ఎదురవ్వలేదు. చేసిన ఐదు సినిమాలు బ్లాక్ బస్టర్లు అయ్యాయి. శత్రుంగ వెట్టై, ఖాకీ, నెర్కొం పార్వల్, వలిమై, తనీవు బ్లాక్ బస్టర్లు. జన నాయగన్ తో డబుల్ హ్యాట్రిక్ పై కన్నేసాడు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339